



సోమశిలలో 13.182 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి జలాశయంలో 13.182 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.





డబ్బులిస్తే ఎక్కడికైనా..!

దొడ్డిడారిలో ఉపాధ్యాయ బదిలీలు

మీరు ప్రభుత్వ టీచరా!? కోరుకున్న చోటకు బదిలీ కావాలనుకుంటున్నారా !? ఇంకెందుకు ఆలస్యం.. మీ దగ్గర డబ్బు, ఓ ప్రజాప్రతినిధి సిఫారసు లేఖ ఉంటే చాలు. వెంటనే పనైపోతుంది. అదెలాగంటారా..!?

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం అంటే ఇదేనేమో! అతిత్వరలో ఎన్నికల కోడ్ వస్తున్న నేపథ్యంలో ఈలోపు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు దొడ్డిదారిన టీచర్ల బదిలీలకు తెరలేపారు. పలుకుబడి ఉన్నవారికి, సిఫార్సు లేఖలతో అభ్యర్థించిన వారికి, నగదు సమర్పించుకున్న వారికి కోరుకున్న చోటకు రెగ్యులర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటివరకు రెండు విడతలుగా 49 మంది వరకు సిఫార్సు బదిలీలకు సిద్ధమవడంతో తొలుత వీటిని జిల్లా విద్యా శాఖ అధికారులు తిరస్కరించినా, రాజకీయ, అధికార ఒత్తిళ్లతో తలొగ్గాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో బ్లాక్ చేసిన ఖాళీలు, పదోన్నతుల్లో ఏర్పడిన ఖాళీల్లో పోస్టింగ్‌ల ఉత్తర్వులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇలా ఎన్నికల కోడ్ వచ్చే వరకు ప్రతిరోజూ ఉత్తర్వులు వస్తాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. పైగా ఈ ఉత్తర్వుల్లో ఏప్రిల్ 30వతేదీ వరకు ప్రస్తుత పాఠశాలల్లో పనిచేసి మే 1న కొత్త పాఠశాలల్లో చేరాలని ఉండటం గమనార్హం.

నెల్లూరు (విద్య), మార్చి 13 : జిల్లాలో గత ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో దాదాపు 4వేల మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. జీఓ నెం.117 ఉత్తర్వులు, పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ తదితర కారణాలతో పలువురు టీచర్లు సుమారు 100 నుంచి 200 కి.మీ దూరంలోని పాఠశాలలకు బదిలీ కావాల్సి వచ్చింది. ఈ నిబంధనలను సవరించాలని దూరప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదు. దీనికి భిన్నంగా గతంలో కొన్ని దొడ్డిదారి బదిలీలు చేపట్టగా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. అయినా కొన్ని జరిగిపోగా తాత్కాలికంగా మరికొన్నింటికి బ్రేక్ వేశారు. తాజాగా ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ఇదే అదునుగా దొడ్డిదారిన బదిలీలను చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచి బదిలీ ఆర్డర్లను తెచ్చుకున్న వారంతా పలుకుబడి, అధికారపక్షం అండదండలున్న వారేనని, బ్లాక్‌చేసిన వ్యాకెన్సీలు, పదోన్నతుల కారణంగా ఏర్పడిన ఖాళీల్లో వీరిని నియమించేందుకు రహస్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు భగ్గుమంటున్నాయి.

- **ఆపకుంటే ఆందోళనలే : యూటీఎఫ్**

ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను నిలిపి వేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వివి.శేషులు, జీవీ.చలపతిశర్మ డిమాండ్ చేశారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి సాధించుకున్న బదిలీల కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వమే తమ విధానాలకు తిలోదకాలిస్తోందన్నారు. ఓ వైపు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీ పోస్టులను ప్రకటించారని, మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సమయంలో హడావుడిగా పైరవీలతో బదిలీలు చేపట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బదిలీల్లో లక్షల రూపాయలు చేతులు మారాయన్న సమాచారం తమ వద్ద ఉందన్నారు. కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచే నగదు బదిలీలను వెంటనే నిలిపివేయాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

- **టీచర్ల గగ్గోలు**

బదిలీలు కోరుకున్న వారంతా స్థానికంగా ప్రజా ప్రతినిధుల నుంచి లేఖలు తీసుకుని రాష్ట్ర కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన అనధికార కౌంటర్‌లో నగదు చెల్లించాలి. అక్కడ నుంచి ఉత్తర్వులు జిల్లాకు వచ్చిన అనంతరం ఇక్కడ కూడా కొంత ముట్టచెప్పి కోరుకున్న స్థానానికి బదిలీ చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకేస్థానంలో ఎక్కువ కాలం పని చేస్తున్నవారు, గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ఈ అక్రమ బదిలీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని పోస్టులన్నీ ఇలా అడ్డదారిన భర్తీ చేస్తుంటే సాధారణ బదిలీ ప్రక్రియ జరిగే సమయంలో తమకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు, ప్రత్యేక కారణాలతో అసాధారణ పరిస్థితుల్లో ఉపయోగించుకోవాల్సిన ప్రభుత్వ ఉత్తర్వుల బదిలీలను ఏకంగా కౌంటర్ తెరిచి అడ్డగోలుగా చేపడుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై విద్యా శాఖాధికారులు కూడా స్పష్టతనిచ్చారు. బదిలీ జీఓలు జిల్లాకు వచ్చిన మాట వాస్తవమేనని, అయితే అన్ని ఉత్తర్వులు సీల్డ్ కవర్స్‌లో తమకు అందాయని, వాటిలో ఎస్‌జీటీల ఉత్తర్వులను సంబంధిత ఎంఈఓలకు, స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులను సంబంధిత డిప్యూటీ ఈఓలకు అందచేశామన్నారు. వీటిని ఆయా డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పరిశీలించుకుని వారికి ఉత్తర్వులు అందచేస్తారని తెలిపారు.

నామినేషన్ల వరకు ఓటరుగా నమోదు..

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : ఎన్నికల నామినేషన్ల వరకు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో ఇప్పటివరకు 19,22,669 మంది ఓటర్లు ఉన్నారని, జనవరి 22వ తేదీ నాటికి ఓట్ల తొలగింపులు, చేర్పుల కోసం 79,690 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వీటిలో 68,291 అర్జీలను అంగీకరించగా, 10958 అర్జీలను తిరస్కరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో టి.బాపిరెడ్డి, టీడీపీ ప్రతినిధి రసూల్, హరికృష్ణ, సురేంద్రబాబు, బీజేపీ ప్రతినిధి బి.శ్రీనివాసులు, వైసీపీ ప్రతినిధి జి.నారాయణ, బీఎస్‌పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ చట్టం వద్దే వద్దు!

నెల్లూరు (వైద్యం) : పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ను వ్యతిరేకిస్తూ నెల్లూరులో బుధవారం వామపక్షాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఆత్మకూరు బస్టాండ్ నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతు చట్టాలను, నిరుద్యోగులకు ఉపాధి వంటి హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ఇలాంటి చట్టాలు తీసుకు వస్తున్నారని మండిపడ్డారు. సీఏఏ వంటి చట్టాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు దామా అంకయ్య, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, ప్రసాద్, శ్రీనివాసులు రెడ్డి, షేక్ రషీద్, పౌరహక్కుల జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వామపక్ష నాయకులు

గవర్నర్ పర్యటన ప్రశాంతం

- వర్చువల్‌గా 'పీఎం సూరజ్' ప్రారంభం
- అబ్దుల్ నజీర్‌తోపాటు పాల్గొన్న ప్రముఖులు
- లబ్ధిదారులతో కలిసి ప్రధాని ప్రసంగం వీక్షణ

నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించిన పీఎం సూరజ్ పోర్టల్ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఇందుకు నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రం వేదికైంది. బుధవారం ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ పీఎం సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించి, దేశవ్యాప్తంగా పలు పథకాల లబ్ధిదారులతో ముచ్చటించగా, ఆ కార్యక్రమంలో నెల్లూరు నుంచి గవర్నర్‌పాల్గొన్నారు. ఈయనతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం హరినారాయణన్, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ కూడా పాల్గొన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో కలిసి గవర్నర్, ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన గవర్నర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్త్రీ నిధి, ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ లబ్ధిదారులకు చెక్కులను గవర్నర్ పంపిణీ చేశారు. అలానే సఫాయి కార్మికులకు పీపీఈ కిట్లు, అర్హులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను కూడా అందజేశారు. చివరగా గవర్నర్ నజీర్‌కు జిల్లా తరపున మంత్రి, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్‌లు ప్రత్యేక బహుమతిని బహూకరించారు. అంతకముందు గవర్నర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. చేతివృత్తులదారులతో ఆయన ముచ్చటించారు. కాగా బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న గవర్నర్ దంపతులకు జిల్లా అధికార యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం అరుణమ్మ, పొట్లూరి స్రవంతి, కలెక్టర్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సాయంత్రం ఐదు గంటలకు తిరిగి విజయవాడకు గవర్నర్ పయనమయ్యారు. కాగా, గవర్నర్ సతీమణి సమీరా నజీర్ అదానీ కృష్ణపట్నం పోర్టును సందర్శించారు.



లబ్ధిదారులకు స్త్రీ నిధి పత్రాలు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



- **పటిష్ట బందోబస్తు**

నెల్లూరు (క్రైం) : పటిష్ట బందోబస్తు నడుమ బుధవారం నెల్లూరులో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన సాగింది. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో నగరంలో గవర్నర్ పర్యటించే ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్‌లు తనిఖీలు చేపట్టాయి. కస్తూర్బా కళాక్షేత్రం వద్ద పోలీసు అధికారుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

'తెలుగు గంగ'లో వాటర్ వార్!

- రాధాకృష్ణకు ఎఫ్ఏసీ బాధ్యతల తొలగింపు
- టీజీపీ ఎస్ఈగా సోమశిల ఈఈ రమణారెడ్డి

నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టుల్లో నీటి కొరత ఇరిగేషన్ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అధికారిక ఆయకట్టుకు నీరిచ్చాక, తాగునీటిని దృష్టిలో పెట్టుకోవాలని అధికారులు సూచిస్తుంటే.. లేదు లేదు అనధికార ఆయకట్టుకు కూడా నీరివ్వాలంటూ వైసీపీ నేతలు పట్టుబడుతున్నారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితులు వేడెక్కుతున్నాయి. ఒక నియోజకవర్గంలో అనధికార ఆయకట్టుకు ఇస్తే, మరో నియోజకవర్గ నేతలు కూడా తమకూ ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తుండటంతో తెలుగుగంగ ప్రాజెక్టులో వాటర్ వార్ జరుగుతోంది. దీని ఫలితంగానే ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఉన్న రాధాకృష్ణమూర్తిని నెల రోజులు తిరగకముందే ఆ బాధ్యతల నుంచి తప్పించినట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. కొత్తగా టీజీపీ ఎస్ఈ బాధ్యతలను సోమశిల ప్రాజెక్ట్ ఆత్మకూరు ఈఈ రమణారెడ్డికి అప్పగించారు. రాధాకృష్ణమూర్తి బుధవారం రిలీవ్ అవ్వగా రమణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. తెలుగుగంగ ప్రాజెక్టులో సుదీర్ఘంగా పనిచేసి ప్రస్తుతం అదే సర్కిల్‌లో వెంకటగిరి ఈఈగా పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తినే నీటి యాజమాన్యం చేయలేక పోయారంటే, ఇక ఆ ప్రాజెక్టుతో సంబంధం లేని రమణారెడ్డి ఎలా చేస్తారంటూ ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకోవడం గమనార్హం. కండలేరులో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకు దగ్గరగా ఉన్నాయి. ఆ ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం మనుబోలు సిస్టం చెరువులకు అధికారిక ఆయకట్టు కింద నీరు ఇస్తున్నారు. అలానే గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ మార్గమధ్యలో అనధికార ఆయకట్టుకు నీటిని తోడేస్తున్నారు. దీంతో అధికారిక ఆయకట్టు సాగు చివరి దశకు చేరుకుంటుండడంతో కొన్ని ప్రాంతాల్లో నీరు అందడం లేదు. ఆ ప్రాంత రైతుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. అలానే తాగునీరు కూడా చివరకు వరకు సరిపడా చేరడం లేదు. దీంతో నీటి విడుదల పెంచాలంటూ టీజీపీ అధికారులపై ఒత్తిళ్ల పెరుగుతున్నాయి. కానీ ప్రస్తుతం కండలేరులో ఉన్న నీరు అధికారిక ఆయకట్టు పోను తాగునీటికి ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉన్న నీటిని సాగుకు ఇచ్చేస్తే రేపు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందంటున్నారు. కానీ వచ్చే నెలలో ఎన్నికలు ఉండడంతో ముందు సాగుకు నీరిచ్చేయండి.. తాగునీటికి ఆ తర్వాత చూసుకుందాం.. అంటూ అధికారులపై ఒత్తిళ్ల పెరుగుతున్నాయి. ఇలా చేస్తే రేపు తాము బోనులో నిలబడాల్సి ఉంటుందని అధికారులు భయపడుతున్నారు. ఈ కారణంగానే రాధాకృష్ణమూర్తిని ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతల నుంచి తొలగించినట్లు ఇరిగేషన్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.27
సహరి (శుక్రవారం) : 4.53

బర్డ్ ఫ్లూ అప్రమత్తంగా ఉండండి

- కేంద్ర నిపుణుల బృందం సభ్యులు

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 13 : బర్డ్ ఫ్లూ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర నిపుణుల కమిటీ బృందం సభ్యులు పశుసంవర్ధక శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ విజయ కుమార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్‌కుమార్‌లు పశువైద్యులకు సూచించారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు నమోదైన నేపథ్యంలో బుధవారం రాత్రి నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశువైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైరస్ లక్షణాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అనుమానం వస్తే వెంటనే నమూనాలు సేకరించాలని, ఆయా గ్రామాలతోపాటు చుట్టుపక్కల గ్రామాలను సైతం అప్రమత్తం చేయాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌డీడీఎల్ సైంటిస్ట్ (బెంగళూరు) డాక్టర్ శంకర్, పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, డీడీలు నాగమణి, కోటేశ్వర రావు, పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ చైతన్యకిషోర్, పశువైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను శాలువాతో సత్కరించారు. కాగా, బర్డ్ ఫ్లూ వైరస్ నమోదైన పొదలకూరు మండలం చాటగుట్ల, బిరుదవోలు, కోవూరు మండలం గుమ్మలదిబ్బ ప్రాంతాల్లో కేంద్ర నిపుణుల బృందం పర్యటించింది. బర్డ్ ఫ్లూ నివారణకు తీసుకున్న చర్యలను పరిశీలించి, నమూనాలు సేకరించారు.



బిరదవోలులో శాంపిళ్లను సేకరిస్తున్న మనోజ్‌కుమార్

పొదుపు మహిళలకు చీరల తాయిలాలాలు

అనుమానించినట్లే జరుగుతోంది. వలంటీర్ల వ్యవస్థను, మెప్మా సిబ్బందిని అధికార పార్టీ ఎన్నికల ప్రలోభాల పర్వాలకు వాడుకుంటుందని ప్రతిపక్షాలు ఆరోపించినట్లే జరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే తెలుగుదేశం పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో మహిళలను ప్రసన్నం చేసుకోవడానికి మెప్మా, వలంటీర్ల ద్వారా తాయిలాలు పంచి పెడుతున్నారు. మహిళలు అత్యంత ప్రీతి పాత్రంగా భావించే చీరలతో తాయిలాల పర్వాన్ని మొదలు పెట్టారు. మెప్మా రిసోర్స్‌పర్సన్స్ (ఆర్పీ), వలంటీర్ల ద్వారా పొదుపు సంఘ మహిళలకు అందజేస్తున్నారు. నెల్లూరుతోపాటు జిల్లా వ్యాప్తంగా ఈ తరహా చీరల పంపిణీ మొదలైనట్లు సమాచారం.

నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా పోలింగ్‌కు ఒకటీ రెండు రోజులకు ముందు ఓటర్లకు తాయిలాలు పంచడం చూశాం. అయితే వైసీపీ ఆవిర్భావం తరువాత తాయిలాల పంపిణీ విధానంలో కూడా అడ్వాన్స్ మెథడ్ అనుసరిస్తోంది. ఎన్నికల సమయంలో తాయిలాలు పంపిణీ చేయాలంటే చాలా అడ్డంకులు ఉంటాయి. ప్రభుత్వ సిబ్బందిని ఆ పనికి వినియోగించుకోవాలంటే చాలా కష్టం. ఈ క్రమంలో నోటిఫికేషన్‌కు ముందే వారిని వాడేసుకోవాలని అధికార పార్టీ అనుకుందేమో పని మొదలు పెట్టేసింది. ప్రజలకు దగ్గరగా ఉండే, ప్రజలతో నిత్యం టచ్‌లో ఉండే వలంటీర్లను, మెప్మా సిబ్బందిని ఇందుకు వినియోగించుకొంటోంది.

- **చైన్ లింకులా..**

అధికార పార్టీ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో భాగంగా కొత్త విధానం ఎంచుకున్నారు. అధికార పార్టీ నాయకులు తమ నిధులతో చీరలు కొనుగోలు చేస్తారు. అవి మెప్మాకు చేరుతాయి. ఆ శాఖ అధికారుల పర్యవేక్షణలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లకు చేరుతాయి. వారు ఆ చీరలను తమ పరిధిలోని వలంటీర్లను వెంట బెట్టుకొని డ్వాక్రా సంఘ లీడర్ ఇంటికి చేరుస్తారు. ఆ లీడరు తన గ్రూప్ పరిధిలోని సభ్యులకు చీరలను పంపిణీ చేస్తుంది. ఇదీ పంపకాల చైన్. నెల్లూరులో గత వారం రోజులుగా చీరల పంపిణీ జోరుగా సాగుతోంది. చీరల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి స్వయంగా ప్రారంభించడం విశేషం.

- **జిల్లావ్యాప్తంగా ఇదే తంతు**

ఎన్నికల కోడ్‌కు ముందే ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమం జిల్లావ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మొదలైనట్లు సమాచారం. మెప్మా పరిధిలో 14,200 పొదుపు సంఘాలు ఉండగా, 1.30లక్షల మంది సభ్యులు ఉన్నారు. తొలుత నెల్లూరులో ప్రారంభమైన ఈ వ్యవహారం క్రమక్రమంగా అన్ని మున్సిపాలిటీల్లో మొదలు పెట్టినట్లు సమాచారం. ఆ తరువాత డీఆర్‌డీఏ పరిధిలోని గ్రామీణ ప్రాంత డ్వాక్రా సంఘ సభ్యులకు కూడా ఇదే తరహాలో చీరల తాయిలాలు అందించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల కోడ్ ఇంకా రాలేదు కాబట్టి ఈలోగా నిర్భయంగా, నిరాటంకంగా ఈ తొలి విడత తాయిలాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ విధుల్లో ఉన్న సిబ్బంది ద్వారా నిర్విఘ్నంగా పూర్తి చేయించడానికి అధికార పార్టీ తొందరపడుతోందని తెలిసింది.



నెల్లూరులో పొదుపు మహిళలకు చీరలు అందజేస్తున్న ఎంపీ ఆదాల (ఫైల్)

పాము కాటుకు విద్యార్థి మృతి


శివరామకృష్ణ(ఫైల్)

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 13: దుత్తలూరు పంచాయతీ చింతలగుంట గ్రామానికి చెందిన దుగ్గినబోయిన శివ రామకృష్ణ (10) అనే విద్యార్థి పాము కాటుకు గురై మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దుగ్గినబోయిన కృష్ణమూర్తి, నాగమణిల కుమారుడు శివరామకృష్ణ స్థానిక విశ్వతేజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్న శివరామకృష్ణ పాము కాటుకు గురై నిద్రలోనే ప్రాణాలు వదిలాడు. తెల్లవారి ఎంతసేపటికీ నిద్ర లేవకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి పరిశీలించగా అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని హుటాహుటిన వింజమూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు అకాల మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేతల పరామర్శ

ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విద్యార్థి మృతదేహాన్ని సందర్శించారు. ఆనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి కాకర్ల రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు, మార్చి 13: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వీవర్స్ కాలనీ సమీపంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కలువాయి మండలం తెలుగురాయపురం గ్రామానికి చెందిన బోయిళ్ల వెంకటేష్ (35) మోటారు బైక్‌పై వేగంగా వెళుతూ అదుపు తప్పి కల్వర్టును ఢీకొని కాలువలో పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్యాలరావు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ముత్తుకూరు, మార్చి 13: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముత్తుకూరులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకి చెందిన ఆర్యాగం విజయన్(27) కృష్ణపట్నం పోర్టులో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక ప్రశాంతి హోటల్ రూం నెంబరు 204లో ఉంటున్నాడు. అతని వద్ద పనిచేసేవారు ఎదురు రూంలో ఉంటున్నారు. బుధవారం డ్యూటీకి వెళ్లేందుకు అతని వద్ద పనిచేసే వారు తలుపుకొట్టగా ఎంతకీ తెరవకపోవడంతో హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు హోటల్ రూం తలుపు బలవంతంగా తెరవగా లోపల విజయన్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముత్తుకూరు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుడికి త్వరలో వివాహం జరగాల్సి ఉంది. వివాహం ఇష్టం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

దూబగుంట హైస్కూల్‌లో చోరీ

ఏఎస్ పేట, మార్చి 13: దూబగుంట హైస్కూల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బుధవారం హైస్కూల్ హెచ్‌ఎం రమణయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేయడానికి 28 సీలింగ్ ఫ్యాన్లు, ఎల్‌ఈడీ లైట్లు, విద్యుత్ పరికరాలను తీసుకువచ్చి ఓ గదిలో ఉంచారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూడగా గది తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్లు, లైట్లు, ఎలక్ట్రికల్ వస్తువులు చోరీకి గురయ్యాయి. దీనిపై ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొల్లమాంబకు ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న జిల్లా ఎస్పీ

నెల్లూరు(క్రైం/హౌస్‌పేట), మార్చి 13: తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆమె చిత్రపటానికి ఎస్పీ కే.తిరుమలేశ్వరరెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండితులకే కాకుండా పామరులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించి, ప్రజలను అలరించిన కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శనికురాలన్నారు. విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించడమే ఆమె ప్రత్యేకత, 16వ శతాబ్దంలోనే మహిళా సాధికారత నాంది పలికిన ధీరురాలు, స్వతంత్ర భావాలు కలిగిన దార్శకురాలు, ఆమెను ఆదర్శంగా తీసుకొని ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష



నెల్లూరు(లీగల్), మార్చి 13: రౌడీ మామూళ్ల వసూళ్ల నేపథ్యంలో ఓ దుకాణం వద్ద జరిగిన గొడవలో అడ్డం వచ్చిన వ్యక్తిపై కత్తులతో దాడి చేసి గాయపరచిన అతని మృతికి కారకులైన కేసులో నేరం రుజువు కావడంతో షేక్ ఆసిఫ్, షేక్ తస్లీర్, షేక్ ఖలీల్ అనే నిందితులకు సెక్షన్ 304 పార్టు-2 కింద ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామిని బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 25 ఏళ్ల లోపు వయస్సు ఉన్న నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన కొండా ప్రవీణ్, చంద్రబాబు నగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్, తస్లీర్, దివ్యాంగుల కాలనీకి చెందిన షేక్ ఖలీల్, భగత్‌సింగ్ కాలనీకి చెందిన షేక్ రఫీలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. దొంగతనాలు, దోపిడీలు, దెబ్బలాటలు చేయడం, పరిసరాల్లో బెదిరింపులు చేసేవారు. వీరందరిపై రౌడీ షీట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఐదుగురు నిందితులు 2021 డిసెంబరు 7వ తేదీన ఉదయం 11 గంటలకు బుజబుజ నెల్లూరులో మెడికల్ షాపు నిర్వహిస్తున్న దువ్వూరుకుమారుడు చెందిన కూరాకు అశోక్ కుమార్ వద్దకు వెళ్లారు. తమకు రూ.10వేల రౌడీ మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానిని వ్యతిరేకించిన ఆయన మీకెందుకు ఇవ్వాలని ప్రశ్నించాడు. దీంతో నిందితులు అతనిపై దాడిచేసి కొట్టారు. ఆదే సమయంలో అక్కడ హైటెక్ షాపు నిర్వహిస్తున్న చంద్రగిరి శ్రీనివాసులు కుమారుడు 16 ఏళ్ల వెంకటేశ్వర్లు వారికి అడ్డుపడ్డాడు. దీంతో ఆ బాలుడిపై కూడా నిందితులు దాడికి పాల్పడ్డారు. తన కుమారుడిని కొట్టడాన్ని గుర్తించిన తండ్రి చంద్రగిరి శ్రీనివాసులు ఘటనా స్థలికి వెళ్లి నిందితులను అడ్డుకున్నాడు. దీంతో అక్కడ జనం గుమికూడడంతో నిందితులు నీ అంతు చూస్తామంటూ అక్కడ నుంచి జారుకున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3-30 గంటల ప్రాంతంలో నిందితులు పథకం ప్రకారం చంద్రగిరి శ్రీనివాసులు హైటెక్ షాపు వద్దకు వచ్చి కత్తులు పట్టుకొని దానిని ప్రశ్నించిన శ్రీనివాసులుపై తమవెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 2021 డిసెంబరు 14వ తేదీన మృతి చెందాడు. దీంతో నిందితులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వీరిలో 1వ నిందితుడు కొండా ప్రవీణ్ మృతి చెందగా 5వ నిందితుడు షేక్ రఫీ పరారీలో ఉన్నాడు. మిగిలిన ముగ్గురు నిందితులపై కేసు విచారణ జరగగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కాగా పరారీలో ఉన్న నిందితుడు షేక్ రఫీ అరెస్ట్ చేసి తీసుకురావాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.విజయ వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	118
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	236
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6238
వెండి కిలో ధర	రూ. 74,500
వెండి ఒక గ్రాము	రూ. 76.50

రాయితీ పరికరాల ఊసేది?

● వ్యక్తిగత సబ్సిడీకి మంగళం ● ఐదేళ్లుగా రైతుల ఎదురుచూపు ● అద్దె రూపంలో పెట్టుబడి భారం



నెల్లూరు(వ్యవసాయం), మార్చి 13: 'మాది రైతు ప్రభుత్వం.. అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తున్నాం.. వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం'.. అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం అన్నదాతల కనీస అవసరాలు తీర్చడంలో విఫలమైంది. దుక్కి దున్నడం నుంచి పంట దిగుబడి చేతికొచ్చేందుకు ఎన్నో యంత్ర పరికరాలు రైతులకు అవసరం. గత ప్రభుత్వం రైతులకు వ్యక్తిగత రాయితీతో ఈ పరికరాలను అందజేసేది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని ఇవ్వకపోవడంతో అద్దె రూపంలో రైతులపై అదనపు భారం పడుతోంది.

● **ఐదు లక్షల ఎకరాల్లో సాగు**

జిల్లాలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో వరి, మినుము, పొగాకు, పత్తి, వేరుశనగ, పెసలు తదితర పంటలతోపాటు కూరగాయలు సాగవుతున్నాయి. సాగునీరు, వాతావరణ పరిస్థితుల ను బట్టి రైతులకు ఇష్టమైన పంటలను సాగు చేస్తుంటారు. సాగులో పంటలకు ఆశించే చీడపీడల నివారణకు ఫురుగు మందుల పిచికారీ యంత్రాల అవసరం ఉంటుంది. దుక్కి దున్నడం దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు వివిధ యంత్ర పరికరాలు కూడా ఎంతో అవసరం. అలాగే పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టలు కూడా ముఖ్యం. ఈ పరికరాలను గత ప్రభుత్వం వ్యక్తిగత రాయితీతో అందించేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం వ్యక్తిగతంగా పరికరాలు ఇవ్వడం లేదు. ఆర్‌బీకే పరిధిలో రైతులను ఒక బృందంగా ఏర్పాటు చేసి వారికి మాత్రమే ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, ఇతర యంత్రాలు అందిస్తోంది. అధికారులు గ్రూపులోని రైతులు అద్దె ప్రాతిపదికన వినియోగించుకున్న తర్వాతే ఇతరులకు అందజేస్తున్నారు. దీంతో సీజన్‌లో రైతులకు అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉండడం లేదు.

ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి



వ్యక్తిగత రాయితీపై యంత్ర పరికరాలు కావాలని రైతులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈ ఏడాది వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. రైతులు గ్రూపుగా ఏర్పడితే వారికి కూడా పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

● **రైతులపై అద్దె భారం**

మందుల పిచికారీ చిన్న తైవాన్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, ఉద్యాన పంటలకు బ్రష్ కట్టర్లు, టార్పాలిన్ పట్టలు అవసరం. బయట మార్కెట్‌లో ఓ స్ప్రేయర్ ధర రూ.24వేలకుపైగా ఉంది. చిన్న, సన్నకారు రైతులు దీన్ని కొనాలంటే అప్పులు చేయాల్సిందే. దీంతో వారు అవసరమైన సమయాల్లో అద్దెకు తీసుకుని వినియోగిస్తున్నారు. అలాగే ట్రాక్టర్ విడిభాగాలు, టార్పాలిన్ పట్టలను సైతం అద్దెకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పంట పెట్టుబడులు బాగా పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రాలో క్రికెట్ ఉన్నతికి కృషి

23 ఎకరాల్లో స్టేడియం
ఆరునెలల్లో అందుబాటులోకి..
ఏసీఏ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 13: ఆంధ్ర ప్రదేశ్‌లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే ఎంతో మంది క్రీడాకారులను, యువ క్రీడాకారులను అత్యున్నతంగా రాణిస్తున్నారని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన జిల్లా క్రికెట్ అసోసియేషన్ మైదానంలోని నెట్స్‌ను, బుజబుజనెల్లూరులోని సీఏపీ మైదానాన్ని పరిశీలించిన అనంతరం కొండాయపాళెంలో యునైటెడ్ క్రికెట్ క్లబ్ నెట్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్‌కు ఎంతో ఆదరణ ఉందన్నారు. ప్రధానంగా గొలగమూడి ప్రాంతంలో 23 ఎకరాల్లో ఏసీఏ క్రికెట్ మైదానాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామని, మరో ఆరు నెలల్లో దీన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దీనితో పాటు కందుకూరు, కావలి, నెల్లూరులలోని సబ్ సెంటర్లలో కూడా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.


క్రీడాకారులతో ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి

జిల్లాలో ఇప్పటికే ఉత్తమ క్రీడాకారులు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో సత్తా చాటుతున్నారని, ఇటీవలి కాలంలో అశ్విన్‌హెబ్బార్, రేవంత్ రెడ్డిలు తమ ప్రతిభతో జిల్లా కీర్తిని ఇనుమడింప చేస్తున్నారన్నారు. క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఇప్పటికే ఏపీఎల్ పేరుతో పోటీలు నిర్వహిస్తుండగా త్వరలో దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా మహిళలకు ఏపీఎల్ పేరుతో పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ ట్రెజరర్, మాజీ కార్యదర్శి డీ.శ్రీనివాస్‌రెడ్డి, ఏసీఏ జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, ఎన్‌డీసీఏ కోశాధికారి ఆబూబకర్, సీనియర్ క్రీడాకారులు బాను ప్రకాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, కోచ్‌లు జలకర్, రాజశేఖర్, మాధురి, ప్రభాకర్, మేనేజర్ నవాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు డిబార్

నెల్లూరు(విద్య), మార్చి 13: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ పాల్పడుతుండగా పట్టుకుని డిబార్ చేసినట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని రావూస్ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాస్తూ ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ పాల్పడుతున్నట్లు గుర్తించి వాస్తవాలను నిర్ధారణ చేసుకుని డిబార్ చేశామన్నారు. అలాగే జిల్లాలో జరుగుతున్న ఇంటర్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ద్వితీయ సంవత్సరం జనరల్ ఫిజిక్స్-2, ఎకనామిక్స్‌తో పాటు ఒకేషనల్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 81 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్ విద్యార్థులు 22,581 మందికి 22,071 మంది హాజరు కాగా 505 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,242 మందికి 1,147 మంది హాజరు కాగా 95 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 23,823 మందికి గాను 23,218 మంది హాజరు కాగా 605 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును ఆర్‌ఐవో డాక్టర్ శ్రీనివాసులు, డీఈసీ మరుబాబు, డీఈసీ సభ్యులు, స్క్వాడ్ కలిపి మొత్తం 42 కేంద్రాలను పరిశీలించారు.

వీఎస్‌యూ అభివృద్ధికి విశ్వేశ్వరరావు ఎంతో కృషి : వీసీ

వెంకటాచలం, మార్చి 13: విక్రమ సింహపురి యూనివర్శిటీ అభివృద్ధికి ప్రథమ వీసీ సీహెచ్ విశ్వేశ్వరరావు ఎంతో కృషి చేశారని వర్శిటీ వీసీ సుందరవల్లి కొనియాడారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూను బుధవారం ప్రథమ వీసీ విశ్వేశ్వరరావు సందర్శించారు. తొలుత ఆయన వర్శిటీ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీని సందర్శించారు. అనంతరం కంప్యూటర్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, వివిధ విభాగాల్లోని పరిశోధన పరికరాలను పరిశీలించారు. వర్శిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భూగోళ శిలాఫలకాన్ని, కిచెన్ గార్డెన్ శిలాఫలకాన్ని వీసీ సుందరవల్లితో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వీసీ సుందరవల్లి వర్శిటీ అభివృద్ధికి ప్రామాణికమైన న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంలో విజయం సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఆండే ప్రసాద్, సుజా ఎస్ నాయర్, సీహెచ్ విజయ, డాక్టర్ కే సునీత, డాక్టర్ ఆర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.



సుందరవల్లితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రథమ వీసీ విశ్వేశ్వరరావు

ఆదిమూర్తిపురంలో పొగాకు బ్యారన్ దగ్ధం

కొండాపురం, మార్చి 13: మండలంలోని ఆదిమూర్తిపురంలో బుధవారం సాయంత్రం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. బాధితురాలు నాదెళ్ల భారతి కథనం మేరకు, పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయని తెలిపారు. మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా వీలుకాలేదన్నారు. వింజమూరు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకునేసరికి పూర్తిగా కాలిపోయిందని చెప్పారు. ఈప్రమాదంలో సుమారు రూ. 9 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

కనుల పండువగా ధ్వజావరోహణం

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 13: నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం 11వ రోజుకి చేరాయి. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు, భువనేశ్వరీదేవికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగింది. అనంతరం తీర్థవారి వేడుక నిర్వహించారు. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.


ధ్వజ అవరోహణ గావిస్తున్న అర్చకులు

క్షయవ్యాధిని పూర్తిగా నివారించాలి

● వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి

నెల్లూరు(వైద్యం), మార్చి 13: జిల్లాలో క్షయవ్యాధిని పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి వెల్లడించారు. బుధవారం వైద్య కళాశాలలో క్షయవ్యాధిపై కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్షయవ్యాధికి ఎన్నో రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ చిన్నారులకు బీసీజీ వ్యాక్సిన్ తప్పక వేయాలన్నారు. క్షయ ముక్త భారత్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్మనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అరుణ, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.


క్షయవ్యాధిపై సమీక్ష చేస్తున్న వైద్యులు

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 13: జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి కేపీ రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎయిమ్స్ ఆధ్వర్యంలో శ్రీసిటీ సెజ్ నుంచి కొన్ని కంపెనీలు, రూఫ్‌వెస్ట్ రియల్ ఎస్టేట్ వారు జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. ఐటీఐ, డిప్లమా విద్యార్హతలు కలిగిన వారికి 50 పోస్టులు, 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన వారికి 120 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు హాజరు కావచ్చని, ఎంపికైన వారికి రూ.14,500 నుంచి రూ.25వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. టెలీకాలర్స్ 5, సేల్స్ మేనేజర్ 10 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎంపికైన వారికి రూ.15వేల నుంచి రూ.18 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు.

4జీ సిమ్‌ను మార్చుకోండి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13: జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలకు అనువుగా అన్ని పరికరాలు వచ్చాయని బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం ఎస్ పుగళేంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు వారి వద్ద ఉన్న 2జీ, 3జీ, సిమ్‌లను ఇచ్చి ఉచితంగా 4జీ సిమ్ పొందాలని కోరారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, రిటైలర్ల నుంచి వీటిని పొందవచ్చన్నారు.


15వ ఆర్థిక సంఘం నిధులతో నాసిరకంగా చేపట్టిన గ్రావెల్ రోడ్డు

గ్రావెల్ రోడ్డు నిర్మాణం

నాసిరకం!

● నిబంధనలకు విరుద్ధంగా పనులు
● అధికారపార్టీ నేతకు వంతపాడుతున్న అధికారులు

విడవలూరు, మార్చి 13: మండల పరిధిలోని వావిళ్ల గ్రామంలో శ్మశానం వద్ద చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణం నాసిరకంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని టీడీపీ నాయకులు ఆరోపిస్తుండగా, అనుమతి మేరకే పనులు చేపట్టామని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.

> జడ్పీ అనుమతి మేరకే..
> జడ్పీ అధికారుల అనుమతి మేరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాం. ఇందులో అవకతవకలు జరగలేదు.
> - శ్రీనివాసులు, పీఆర్ ఏఈ

● **నిబంధనలకు నీళ్లు**

శ్మశానవాటిక సమీపంలో ఉన్న దొంతరవారి మరమ్మతులకు జడ్పీ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15లక్షలు మంజూరయ్యాయి. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధులను నిమెంటు రోడ్లు, తాగునీటి పనులకు, సైడు కాలువల నిర్మాణాలకు వినియోగించాలి. అయితే జడ్పీ అనుమతి మేరకు పంచాయతీరాజ్ అధికారులు ఆ నిధులను మట్టి రోడ్డుకు వినియోగించడం చర్చనీయాంశమైంది. అధికారపార్టీ నేతకు చుట్టంగా మారిందని ఆరోపిస్తున్నారు.

> కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం...
> కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను సిమెంట్ రోడ్డు పనులకు వినియోగించాలి. అలాకాకుండా మట్టిపనులకు వినియోగించడం సరికాదు. ఈ విషయంపై కలెక్టరుకు కలిసి ఫిర్యాదు చేస్తాం.
> - మాతూరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రైతు సంఘం నాయకులు

● **పనుల్లో అవకతవకలు**

అధికారుల అంచనా ప్రకారం గ్రావెల్ రోడ్డు 1400 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పు 6 ఇంచుల మందం ఉండాలి. లెవలింగ్ చేసిన తరువాత గ్రావెల్ వేయాలి. అయితే పనులు చేపట్టిన అధికార పార్టీ నేత రోడ్డు లెవలింగ్ పనులను నామమాత్రంగా చేశారు. దానిపై మూడు, నాలుగు అంగుళాలు మాత్రమే గ్రావెల్ వేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ఊరూమంత్రంగా కల్వర్టు పనులు చేశాడన్న విమర్శలు కూడా ఉన్నాయి. గ్రావెల్ వేసిన తరువాత రోడ్డు రోలర్‌తో తొక్కించకుండా వదిలేశారని స్థానికులు తెలిపారు. ఇలా అధికార పార్టీ నేత ఇష్టం వచ్చినట్లు రోడ్డు వేస్తున్నా పంచాయతీరాజ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు సమగ్రమైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

బుచ్చిలో బంగారం చోరీ

● తల్లి వద్దకు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి13: పట్టణంలోని బాజా గార్ సెంటర్ సమీపంలోని ఓ ఇంట్లో కాపురముంటున్న షేక్ షాహినా ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు, అల్మారా బీరువా తాళాలు పగులగొట్టి బీరువాలోని రెండు సవర్ల బంగారు చైను, రెండు ఉంగరాలను దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు, షాహినా సోమవారం స్థానిక రామాలక్ష్మీపురంలో కాపురముంటున్న తన తల్లి వద్దకు వెళ్లింది. బుధవారం సాయంత్రం ఆమె తిరిగి తన ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు బుధవారం తెలిపారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

మరుగుదొడ్లు లేక ఇక్కట్లు

● ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళల అగచాట్లు

ఉదయగిరి, మార్చి 13: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మహిళల బాధలు వర్ణనాతీతం. పట్టణంలో తహసీల్దారు కార్యాలయంతో పాటు అదే ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్, ఇండేన్ గ్యాస్, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక అగచాట్లు పడుతున్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంతోపాటు పొదుపు, హౌసింగ్, విద్యాశాఖ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉపాధి, కొట్బాలపల్లి సొసైటీ, ఇరిగేషన్ తదితర శాఖల కార్యాలయాలు ఉన్నాయి. అక్కడికి వచ్చే ప్రజలు సైతం మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా మరుగుదొడ్లు లేక ప్రజలు పాడుపడి నిరుపయోగంగా ఉన్న భవనాలు, ఖాళీ ప్రదేశాలను వాడుకుంటున్నారు. మహిళలైతే ఖాళీ ప్రదేశంలోని కంపచెట్లను ఆశ్రయించక తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


మరుగుదొడ్డిగా ప్రజలు వాడుకుంటున్న పాత భవనాలు

మొల్లమాంబ జయంతి


మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి, మార్చి 13: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎంపీడీవో ఈశ్వరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగరంలో భద్రతా బలగాల కవాతు


అనంతసాగరంలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

అనంతసాగరం, మార్చి 13: మండలంలోని ఇస్కపల్లి, రేవూరు, మినగల్లు, అనంతసాగరంలో బుధవారం కేంద్ర భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈకార్యక్రమం నిర్వహించినట్లు అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లావణ్య

ఉదయగిరి రూరల్, మార్చి 13: చిన్నారులు, బాలింతలు గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవా లని సీడీపీవో పచ్చవ లావణ్య సూచించారు. బుధవారం మండలంలోని గండిపాళెం సెక్టార్ పరిధి వెంగళరావునగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, సూపర్‌వైజర్ తేజస్విని, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం


వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎంపీడీవో

వింజమూరు, మార్చి 13: వింజమూరు మండలంలోని సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను బుధవారం ఘనంగా సన్మానించారు. వింజమూరు పంచాయతీ పరిధిలోని ఏడు సచివాల యాలకు సం బంధించిన వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరై అవార్డు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, చైర్మన్ మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఎన్ సుజన, వైసీపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష సుబ్బారావు

ఉదయగిరి రూరల్, మార్చి 13: మండలంలోని గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యూష సుబ్బారావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ఉపాధ్యక్షుడు సుమన్, ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

సంగం, మార్చి 13: మండలంలోని మర్రిపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు బుధవారం నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పులిబోయిన హరి ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ ముడి పార్థసారధి, వార్డు సభ్యులు మరుబోయిన వెంకటేశ్వర్లు, ఖాశీం, కె పెంచలయ్యతోపాటు పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆనం రామనారాయణరెడ్డి వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మండలంలోని ముక్తాపురంలో వైసీపీ నేత మోహన్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, జక్కా సుబ్బారెడ్డి, దుస్వంత్‌రెడ్డిని కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అలాగే వైసీపీ మండల నాయకులు, మాజీ జడ్పీటీసీ గంగపట్నం చంద్రశేఖరయ్య, పడమటిపాళెం సర్పంచు, మండల వైసీపీ సీనియర్ నాయకులు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డిని, వంగల్లుకు చెందిన వైసీపీ అసంతృప్తి నాయకుడు పగడాల రఘురామయ్యను కలిసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచు రఘురామయ్య, వైసీపీ అసంతృప్త సంగం, వెంగారెడ్డిపాలెం నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఆనం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గంగపట్నం చంద్రశేఖరయ్యతో సమావేశమైన ఆనం రామనారాయణరెడ్డి

మాజీ ఎమ్మెల్యే మేకపాటితో మన్నేటి చర్చలు

ఉదయగిరి రూరల్, మార్చి 13: నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులపై మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో ఉదయగిరిలోని తన నివాసంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు బుధవారం చర్చించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అధిష్ఠానం నిర్ణయించిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించేందుకు కష్టపడి పని చేయాలని నిర్ణయించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ఉదయగిరి రూరల్, మార్చి 13: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఉదయగిరి పట్టణంలో బుధవారం అధికారులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి మోటార్ బైక్‌లతో పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ఆర్వో రాజా రమేష్‌ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబులు జెండా ఊపి ప్రారంభించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, అమ్ముకోవద్దని, ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి బాలకేశవులు, అసిస్టెంట్ నోడల్ అధికారి ఖాజారంతుల్లా, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

ఉదయగిరి, మార్చి 13: మండలంలోని 12 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ బుధవారం తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్లు పంపిణీ చేసి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

సీతారామపురం, మార్చి 13 : మండలంలోని గుండుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, సీతారామపురం బిట్-1 సచివాలయానికి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహి స్తున్న నాగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా కడప జిల్లా అట్లూరు మండలానికి బదిలీ అయిన సందర్భంగా సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డి రాం నాథ్‌రెడ్డి, సీతారామపురం కార్యదర్శి జీవన్‌కుమార్, చిన్నాగంపల్లి కార్యదర్శి పిడుగు రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నాగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచి

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఎన్నికల సిబ్బందికి సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం యంత్రాల పనితీరుపై సెక్టారు హోమ్ ఓటింగ్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకారం

ఆత్మకూరు, మార్చి 13 : నియోజకవర్గంలోని ఎంఎస్ఎంవి పార్కులో చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో ఆయన ఏపీఐఐసీ, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు ప్రతినిధులతో కలిసి పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చేయూత సంబరాలలో పాల్గొని పొదుపు మహిళలకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లులా, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు డాక్టర్ కెవి శ్రావణకుమార్, షేక్ సర్దార్, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మెప్మా సీఎంఎం వి అంకయ్య, సీఓ మాధవి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి రూరల్, మార్చి 13: మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు బసిరెడ్డి బాలిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మార్చి 13: డీసీపల్లి పొగాకు బోర్డులో బుధవారం కనిష్ఠ, గరిష్ఠ ధరలు కేజీ రూ. 230 పలికాయి. రైతులు బోర్డుకు 325 బేళ్లను తీసుకొని రాగా, 12 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 308 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 17 బేళ్లను తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

అందుబాటులో లేని రెవెన్యూ సిబ్బంది

● ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల ఇక్కట్లు

కలిగిరి, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గడువు సమీపిస్తుండటంతో తహసీల్దారు కార్యాలయ సిబ్బంది శిక్షణకు వెళ్తున్నామన్న కారణంతో కార్యాలయంలో ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. దీంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు నెలలు తరబడి తిరగాల్సి వస్తోంది. నిర్ణీత గడువులోపు అవి అందకపోవడంతో తమ పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వాటి కోసం కావలి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాల్సివస్తుం దని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భూములకు సంబంధించి నేషనల్ ఖాతాలు వెబ్‌ల్యాండ్‌లో పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం వలన మ్యుటేషన్ సర్వీసు చేసుకోవడానికి వీలు కావడంలేదని రైతులు పేర్కొంటున్నారు.



అయిన వారి కోసం అడ్డదిడ్డంగా డ్రైనేజీ పనులు

కావలి, మార్చి13: పట్టణంలోని పోలువారివీధిలో అ యిన వారి కోసం అడ్డదిడ్డంగా డ్రైనేజీ పనులు చేపడుతు న్నారు. దీంతో బుధవారం స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వీధిలో డ్రైనేజీ మంజూరు చేయగా, నిర్మాణ ప నులను అధికారపార్టీ నేత ప్రారంభించారు. అయిన వారి కోసం డ్రైనేజీని అష్టవంకరలు తిప్పుతున్నారు. దీనిపై స్థాని కులు అభ్యంతరం చెప్పటంతో ఇటీవల పనులు ఆపివే శారు. తిరిగి బుధవారం ఎక్స్‌కవేటర్ తీసుకు వచ్చి పాత డ్రైనేజీని దాని పక్కన సీసీ రోడ్డును తవ్వుతుండటంతో స్థా నికులు అభ్యంతరం చెప్పారు. ఈ విషయంపై మున్సిప ల్ డీఈ సాయిరాంను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని, అక్కడకు వెళ్లి పరిశీ లించి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పోలువారివీధిలో కాలువను వదిలి సీసీ రోడ్డును పగులకొడుతున్న ఎక్స్‌కవేటర్



దూబగుంటలో పౌష్టికాహార పక్షోత్సవం


దూబగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఆయాలు

కందుకూరు, మార్చి 13: మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నల్లపు మాధవి, జేబీ యూన్సీ స్వాతి, సునీత, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో శర్మిష్ఠ తెలిపారు. మండలంలోని నూకవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనత దూరమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, టీచరు రాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, అలేఖ్య పాల్గొన్నారు.

కావలి: పట్టణంలోని క్రిష్టియన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు రక్తహీనత, కండరాల అభివృద్ధి, సృజనాత్మకత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై. సావిత్రి, సురజాదేవి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

23న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

కందుకూరు, మార్చి13: పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం ఈనెల 23న కందుకూరు నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం పెద్దన్నశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు ప్రత్యేకబస్సు బయలుదేరుతుందని, భోజన సౌకర్యంతో కలిపి టికెట్ ధర రూ. 2,600గా నిర్ణయించామన్నారు. వివరాలకు 73828 89870 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేపు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

కొండాపురం, మార్చి13: మండలంలోని పార్లపల్లిలో ఈనెల 15న టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం బుధవారం తెలిపారు. సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ముఖ్య అతిథి రానున్నారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కందుకూరు, మార్చి 13: పట్టణంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ప్యాడ్, పెన్నులు, ఇతర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో స్వాతి, సొసైటీ ప్రతినిధులు చక్కా కేశవరావు, ఇన్నమూరి శ్రీనివాసులు, సోమిశెట్టి శశాంక్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కావలిటౌన్, మార్చి13: ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసరావు బుదవారం పట్టణంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జేబీ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించిన ఆర్ఐవో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయన్నారు. నెల్లూరు రావూస్ కళాశాల కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డ ముగ్గురిని డిబార్ చేశామన్నారు. జేబీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సన్నితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

కావలి, మార్చి13: విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాయంత్రం ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందని పొలాల పరిశీలన

జలదంకి, మార్చి 13 : ఎల్ఆర్ అగ్రహారం గ్రామంలో సాగునీరందక వరిపొలాలు ఎండుము ఖం పట్టాయి. దీంతో సర్పంచి మంగలి తిరుమల, రైతులు గాలి శ్రీనివాసులు, గుర్రం సుబ్బారావు తదితరులు ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీంతో వారు బుధవారం వరిపొలాలను పరిశీలించారు. కావలి కా లువ ద్వారా సాగునీరిచ్చి పంటను కాపాడాలని రైతులు కోరారు. సోమశిల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పంటను కాపాడుతామని ఇరిగేషన్ డీఈ, ఏఈలు రైతులకు హామీ ఇచ్చారు.

అత్యాచార బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

అల్లూరు: అత్యాచార బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి జి ల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ధ ర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచారాలకు గురైన ఎస్సీ ఎ స్టీ యువతులు, మహిళలకు నష్టపరిహారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నష్టపరిహారం కోసం బాధితులు కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఆదుకునే నాథుడు కరువయ్యాడన్నారు. త్వరితగతిన నష్టపరిహారం ఇవ్వకుం టే జిల్లావ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు.అనంతరం తహసీల్దారు దుర్గేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, దర్శిగుంట కోటయ్య, కాకాణి వెంకయ్య, కోవూరు బాబు, జడ్డా వాసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే.. 20 ఏళ్లకు సరిపడా అభివృద్ధి

కావలి, మార్చి13: తనకు ఒక్క అవకాశం ఇస్తే కావలి నియోజకవర్గం లో 20 ఏళ్లకు సరిపడా అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించి, అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ట్రంకురోడ్డులోని ఒంగోలు బస్టాండ్ సెంటర్ నుంచి ఎన్ని కల ప్రచారం చేపట్టారు. వ్యాపారులను కలిసి తనకు నెల్లూరు ఎంపీగా వే మిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. టీడీపీ కూటమి అధికా రంలోకి వస్తే అమలు చేసే పథకాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కావలిలో టీడీపీ, జనసేన నాయకుల ర్యాలీ

● కల్మషం ఎరుగని నిజాయతీపరులు మత్స్యకారులు

కావలి రూరల్ : కాయాకష్టం తప్ప కల్మషం ఎరుగని నిజాయతీపరులు మత్స్యకారులని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ ఆధ్వర్యంలో బుధవా రం తుమ్మలపెంట, అన్నగారిపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకార యువ కులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాల్గొన్న కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడు తూ మత్స్యకారులు తుమ్మలపెంట రోడ్డుతో పడుతున్న ఇబ్బందులు వర్ణనా తీతమన్నారు. ఈ ఎమ్మెల్యే పదవిలో ఉన్నంతకాలం తుమ్మలపెంట రోడ్డు ప నులు జరగవని అన్నారు. తాను గెలిస్తే రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కలిసికట్టుగా పనిచేసి కావ్యను గెలిపిద్దాం...

బిట్రగుంట : టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కలసి కట్టుగా పనిచే సి కావలి నుంచి కావ్య క్రిష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని టీడీ పీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి అన్నారు. బోగోలు మండలం పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో మూడు పార్టీల నేతల సమావేశం జరిగింది. బీజేపీ మండల అ ధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు గు ర్రం వెంకటేశ్వర్లు, జనసేవ మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకటేష్, ప్ర ధాన కార్యదర్శి గంగపట్ల సురేష్ కుమార్‌లకు టీడీపీ నేతలు శాలువలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ రాను న్న ఎన్నికల్లో సైకో పా లనకు ముగింపు పలకాలని అన్నారు. కార్యక్రమంలో నేతలు వెంకటేశ్వర్లురెడ్డి, రఘురామ్‌నాయుడు, వై.వెంకటేశ్వర్లు, మాధవరావు, అహ్మద్‌బా షా, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

● క్షేత్రస్థాయిలో దృఢంగా ఉండాలి : బీద గిరిధర్

అల్లూరు : రానున్న ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు దృ ఢంగా ఉండి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని నెల్లూరు పార్లమెంటు ఉ పాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు మండలం నార్తుఆములూరులో ఆయన బుధవారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇన్నాళ్లు ఎదుర్కొన్న సమస్యలు తీరాలంటే టీడీపీ గెలుపు అనివార్యమన్నారు. ఈ నెలన్నర రోజుల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐని కాదు ఎన్ఆర్‌యుని : కాకర్ల

కలిగిరి, మార్చి 13: వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాలరెడ్డి ప్రచారం చేస్తున్నట్లుగా తాను ఎన్ఆర్ఐని నాన్ రెసిడెన్స్ ఉదయగిరి (ఎన్ఆర్‌యు)ని మాత్రమేనని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి ఇంటి వద్ద బుధవారం జరిగిన పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనకు కుటుంబ బాధ్యతలన్నీ తీరిపోయాయని, ఆర్థిక లావాదేవీలు తన సోదరుడు సునీల్ చూసుకుంటు న్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఉపాధి, తాగు, సాగునీరు కల్పనకు అధిక ప్రాధాన్యతని స్తామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బీవీ రామారావు, కాకు మహేష్, గంజాం రాఘవేం ద్ర, స్వర్ణ కొండయ్య, మదన్‌కుమార్, ఎంవీ రామిరెడ్డి, తాతయ్య పాల్గొన్నారు.


కలిగిరిలో మాట్లాడుతున్న కాకర్ల సురేష్

టీడీపీలో చేరికలు

బిట్రగుంట: బోగోలు మండలం ఏటీ కండ్రికలో స్థానిక టీడీపీ నేత గద్దె కొండయ్య ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం జరగ్గా మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు పాల్గొన్నారు. బిట్రగుంట పంచాయతీ టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి వెంకటరామకృష్ణ ఆ ధ్వర్యంలో పాస్టర్ సాదిక్‌ఖాన్ ఆయన కుటుంబ సభ్యులు పార్టీలో చేరారు. వారికి కావ్య సోదరుడు దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువా కప్పారు. మాజీ ఎంపీటీసీ ముంతాల వెం కయ్య, గోచిపాతల సంజయ్ ఆధ్వర్యంలో జేతనీపేటకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.


టీడీపీలో చేరిన పాస్టర్ సాధిక్‌ఖాన్ దంపతులు తదితరులు

పేదల వైద్యానికి ప్రాధాన్యత

కావలి, మార్చి13: పేదల వైద్యానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాడని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్ర తాప్‌కుమార్‌రెడ్డి తెలి పారు. పట్టణంలోని వై కుంఠపురం, పుల్లారెడ్డిన గర్‌లలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాల ను బుధవారం డీఎంహెచ్‌వో పెంచలయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ ఈ అర్బన్ హెల్త్‌సెంటర్ల ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవైద్యఆరోగ్యశాఖ అధికారిణి బ్రిజిత, మెడి కల్ ఆఫీసర్ ఫరూక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, వైసీపీ నేత లు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గుడ్లూరు, మార్చి 13: మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. వెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన వైఎస్సార్ చేయూత నాలుగవ విడత చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. అనంతరం నాలుగో విడత చేయూత చెక్కును పొదుపు మహిళలకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటరమణ, ఏపీఎం అశోక్, ఎంపీపీ పులి రమేష్, వైస్ ఎంపీపీ ఎం. శ్రీరాములు, సర్పంచి పీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి

నర్సు అంటే ప్రాణదాత

కందుకూరు : నర్సు అంటే ప్రాణదాతగా భావిస్తారని సరోజినీదేవి నర్సింగ్ కళాశాల నిర్వాహకురాలు కంచర్ల విజయ్ ఇందిరాదేవి అన్నారు. బుధవారం రాత్రి ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ సెమినార్ హాలులో బీఎస్సీ నర్సింగ్ తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నైటింగేల్ స్మరణతో జ్యోతివెలిగించి ప్రమాణం చేశారు. అనంతరం టెక్నికల్ డైరెక్టర్ కే విజయ్‌శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంచర్ల రామయ్యను సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాళ్లు పీ జ్యోతి, కే సోనీ పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని గెలిపించండి

● నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి నీటి బిందె అందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విడవలూరు, మార్చి 13: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించి, అభివృద్ధికి నాంది పలకాలని నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వీపీఆర్ ట్రస్టుద్వారా ముదివర్తిలోని చెలికల, గాంధీగిరిజన సంఘంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లను బుధవారం ఆయన కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. మండల కో ఆప్షన్ మెంబరు ఎస్‌కే రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2017 నుంచి జిల్లాలో దాదాపు 135 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి పేదలకు మంచినీటిని అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించటం తథ్యమని, గెలిచిన తరువాత గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆనంతరం దినేష్‌రెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ గెలుపునకు ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెముకుల కృష్ణచైతన్య, చెముకుల శ్రీనివాసులు, ఇమాంబాషా, ఇంతా మల్లారెడ్డి, షరీఫ్, రామిరెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానం

తోటపల్లిగూడూరు, మార్చి 13 : వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని జనసేన నాయకుడు, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని చింతోపు, పేడూరు లింకురోడ్డును బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, గంప మట్టి కూడా పోసిన దాఖలాలు లేవన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థికి ప్రజలు ఓటువేసి వైసీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వాణిభవానీ, శ్రీహరి, శ్రీనివాసులు, వినోద్, శరత్, గణేష్‌గౌడ్, నిఖిల్, నవీన్, రవిగౌడ్, వినయ్ పాల్గొన్నారు.

కూటమితో వైసీపీ ఓటమి తథ్యం : పట్టాభి

కొడవలూరు, మార్చి 13 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో వైసీపీ ఓటమి తథ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మండలంలోని గండవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పరిశ్రమలు రాక నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే సీఎంగా చంద్రబాబు రావాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఎ.మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ కూలీల నోళ్లు కొడుతున్న కాకాణి : సోమిరెడ్డి

ముత్తుకూరు, మార్చి 13 : పరిశ్రమల్లో రోజువారీ కూలికి వెళ్లే వారి నోళ్లు కొట్టే స్థాయికి మంత్రి కాకాణి దిగజారాడని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ముత్తుకూరు పంచాయతీలోని చలివేంద్ర గ్రామంలో బుధవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు ఇతర పరిశ్రమల్లో కూలీలకు వెళ్లే వారికి రోజుకి రూ.350 ఇస్తుంటే అందులోనూ రూ.100 దండుకొని కూలీలకు రూ.250 ఇవ్వడం దారుణమన్నారు. కంటైనర్ టెర్మినల్ మూతపడేలా చేసి 10వేల మంది ఉద్యోగులను కాకాణి రోడ్డుపై పడవేశాడన్నారు. బీజేపీతో ఈనెల 15న సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయ సమావేశం జరుగుతుందని త్వరలో జనసేనతోనూ సమావేశమై ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం గ్రామంలో ప్రచారం చేస్తున్న సోమిరెడ్డి

25 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెంకటాచలం/మనుబోలు : మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి బుధవారం టీడీపీలో చేరాయి. నెల్లూరులోని సోమిరెడ్డి కార్యాలయంలో నాయకులు ఏలూరు కోదండరామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అమీర్ బాషా ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. కాగా, సోమిరెడ్డిని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు బోనుబోయిన ప్రసాద్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసినేటి అనీల్‌కుమార్, నడవల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి వైభవంగా ఏకాంతసేవ

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి13: స్థానిక రామకృష్ణానగర్‌లో కొలువై ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు బుధవారం ఏకాంతసేవతో ముగిశాయి. ఆఖరిరోజు రాత్రి పండితులు నిర్వహించిన ఏకాంత సేవలో పాల్గొన్న భక్తులు ముందుగా స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి అల్లూరు వెంకటశేషయ్య, కామేశ్వరరావు, సాయికుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సిమెంటు బెంచీల ఏర్పాటు

పొదలకూరు, మార్చి 13 : పట్టణంలోని ప్రధాన హిందూ శ్మశాన వాటికలో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 10 సిమెంటు బెంచ్‌లు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నెల్లూరు జోనల్ చైర్మన్ లయన్ టీవీ కిషోర్‌కుమార్, పొదలకూరు లయన్స్ క్లబ్ చైర్మన్ తన్నీరు సాయిచందు, ఆత్మకూరు లయన్స్ క్లబ్ సెక్రటరీ నున్నా సంతోష్, ఆదూరు సుబ్బులు, పట్టణ లయన్స్ క్లబ్ సభ్యులు ఆకులూరు మధుసూదన్‌రావు, గాదంశెట్టి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపల్లిలో రేపు వైద్య శిబిరం

పొదలకూరు, మార్చి 13 : శ్రీ కరుణామయి చారిటబుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారెడ్డిపల్లి రామాలయం దగ్గర నిర్వహించే ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, కంటి సంబంధిత వ్యాధుల నిపుణులు, ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణులు, దంత వైద్యులు పాల్గొని అవసరమైన వారికి ఉచితంగా మందులు, ఉచిత ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు మేనేజర్ 94904 92816 నెంబరును సంప్రదించాలన్నారు.

కల్లుగీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెంకటాచలం, మార్చి 13: మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు నాశిన అంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంకయ్య కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్ గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్, జిల్లా కార్యదర్శి కోసూరు వెంకటసుబ్బయ్య గౌడ్, అనికేపల్లి మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మా గౌడ్, కల్లుగీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి

మనుబోలు, మార్చి 13 : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని బద్దెవోలు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశా వలంటీర్ సుందరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ చందన తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలుగు రచయిత్రి మొల్ల

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి13: చరిత్రలో తొలి తెలుగు రచయిత్రి మొల్ల అని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మొల్ల జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సైదాపురం :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏవో పురుషోత్తం, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటరైజేషన్‌ను పరిశీలిస్తున్నాం

బుచ్చిరెడ్డిపాళెం : జిల్లాలోని సహకార బ్యాంకుల్లో కంప్యూటరైజేషన్‌ను పరిశీలిస్తున్నామని జిల్లా కోఆపరేటివ్ అధికారి బీ గురప్ప అన్నారు. బుధవారం ఆయన బుచ్చిలోని వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ బ్యాంకును సందర్శించారు. అయితే బ్యాంకులో ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారని పుకార్లు రేగాయి. పుకార్ల గురించి ఆయన్ను అడగ్గా, బ్యాంకులో కంప్యూటరైజేషన్‌ను మాత్రమే పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట బుచ్చి, వవ్వేరు బ్యాంకు మేనేజర్లు సురేష్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

వెంకటాచలం, మార్చి 13 : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ అవరణలో ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ నీటి కాసుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కంటి వైద్యశాల ఏవో ఎస్ వెంకటరావు, ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ అశ్విని కులకర్ణి డాక్టర్ ఉపాసన పోకర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కళ్ల పట్ల శ్రద్ధ చూపాలని, కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ వైద్యశాల సిబ్బంది తదితరులున్నారు.

యామాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సైదాపురం : మండలంలోని తోకలపూడి గ్రామ దేవత యామాలమ్మ ఆలయ నిర్మాణాని కి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం, అమ్మవారికి పూజలు చేశారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

ముత్తుకూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం కిట్లను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని తాళ్లపూడి గ్రామ ఉప సర్పంచ్ గోపాల్ సూచించారు. తాళ్లపూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవం సందర్భంగా పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ దువ్వూరు హరికృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమ్మనమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురవయ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

తోటపల్లిగూడూరు : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన గోపిరెడ్డి వెంకటేశ్వర్లును బుధవారం సర్పంచులు, టీడీపీ యువత నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చైతన్యకుమార్, టీడీపీ నాయకులు షఫీ, పాముల హర్షవర్ధన్, ఊటుకూరు అవినాష్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

తీర్మానం ఇవ్వకుండా పొట్టకొడుతున్న సర్పంచి

● ఉపాధి కూలీల ఆవేదన

విడవలూరు, మార్చి 13: గ్రామ సర్పంచు విడవలూరు నిర్మలమ్మ 2024-25 ఆర్థిక సంవత్సరానికి తీర్మానం ఇవ్వకుండా తమ పొట్టకొడుతోందని ముదివర్తి గ్రామ ఉపాధి కూలీలు ఆరోపించారు. గ్రామంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామ సర్పంచు రాజకీయ కక్షలను మనసులో పెట్టుకుని 47 పనులకు తీర్మానం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. నెలాఖరు లోగా తీర్మానం ఇవ్వకపోతే పనులు ఆన్‌లైన్‌లో పెట్టడం వీలుకాదన్నారు.దీంతో తమ కుటుంబ జీవనం చాలా కష్టంగా మారుతుందన్నారు. ఈ విషయంపై ఎంపీడీవోకి చాలా సార్లు ఫిర్యాదు చేశామని, అయన ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఉపాధి కూలీలు

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

నేడు గరుడ పంచమి

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 13 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గురువారం గరుడ పంచమి సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి బంగారు గరుడసేవ, పేట ఉత్సవం జరుగుతుందని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ డి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తా : పొంగూరు



స్థానికులతో మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(వైద్యం), మార్చి 13 : టీడీపీని అదరించి గెలిపిస్తే నగరంలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని మాజీమంత్రి, టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 48వ డివిజన్‌లో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటికి తిరిగి నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, సిటీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం పార్కుల నిర్వాహణ గాలికొదిలేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే డివిజన్‌కు రెండు పార్కుల నిర్మాణానికి శ్రీకారం చుడతామని, వాటి నిర్వాహణ బాధ్యత చేపడతామని తెలిపారు. నగరంలో 2014 నుంచి 2018 వరకు రూ.5,260 కోట్లతో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. వచ్చే టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో అన్ని విధాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

బీద రవిచంద్రను కలిసిన మత్స్యకారులు



నెల్లూరు(వ్యవసాయం) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను మాగుంట లేఅవుట్‌లోని ఆయన నివాసంలో ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు పోలిశెట్టి, మత్స్యకార సాధికార కమిటీ కన్వీనర్ పామంజి శేషయ్య నేతృత్వంలో నెల్లూరు పార్లమెంటు పరిధిలోని మత్స్యకారులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాజకీయ పరమైన పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీదతో పాటు వెంకట గిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఉన్నారు.

వైసీపీ నేతల దందాలకు వ్యాపారులు బలి



మాట్లాడుతున్న టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), మార్చి 13: వైసీపీ నేతల దందాలకు వ్యాపారులు స్వేచ్ఛగా తమ వ్యాపారులను చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. బుధవారం 46వ డివిజన్‌లో కోటంరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొంగూరు నారాయణను గెలిపించాలని స్థానికులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉండగా వ్యాపారస్తులు హాయిగా వ్యాపారాలు చేసుకునే వారన్నారు. మరో రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని వ్యాపారులు అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పేదవారు ఆర్థిక ప్రయోజనాలు మెరుగుపడినప్పుడే సంతోషంగా ఉంటారని చెప్పారు. పాలనలో ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబునాయుడు అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పిట్టి సత్యనాగేశ్వరరావు, కోకు మహేంద్రరెడ్డి, దశరథరామిరెడ్డి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జెండా పట్టుకునేవారే ఉండరు..



వేమిరెడ్డి నివాసంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

నెల్లూరు (వైద్యం), మార్చి 13 : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీ జెండా పట్టుకునే వారే ఉండరని రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో నెల్లూరు రూరల్ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు పల్లంరెడ్డి రవీంద్రరెడ్డి, మాదరాజు గూడూరు సర్పంచు చిట్టిబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ఉపసర్పంచు నెత్రంబాక రవి, కాకుపల్లి సర్పంచు కోసూరు సుభాషిణి, కోసూరు కేశవులు, ఉపసర్పంచు తాటిపల్లి సాల్మన్, వార్డు సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. వీరికి వేమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో రూరల్‌లో వైసీపీకి భారీ షాక్ తగిలినట్లైంది. అనంతరం 26 డివిజన్‌లోని ఎంవీఎస్ కల్యాణ మండపంలో జరిగిన మహిళ రక్ష ఆశీర్వచన కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిని మహిళలు వర్ధినేని లక్ష్మి, రత్నం నాయుడు, వారిమిత్ర బృందం ఆశీర్వదించగా వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అన్ని రకాలుగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, సంక్షేమ వైపు నడిపించేలా టీడీపీ నేత చంద్రబాబునాయుడు కృషి చేస్తారని కోటంరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత వైసీపీకి చెందిన మరో ముగ్గురు కీలక నేతలు టీడీపీలోకి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, కోడూరు కమలాకరరెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, జెన్ని రమణయ్య, ఊరుందూరు సురేంద్రబాబు, పఠాన్‌ఖాన్ పాల్గొన్నారు.

సంక్షేమం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

● టీడీపీ బీసీ సెల్ నేత రాఘువేంద్ర

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 13 : వైసీపీ అధికారంలోకొచ్చాక 130 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర పేర్కొన్నారు. నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ తిరిగి అధికారం కోసం అర్రులు చాస్తున్న తీరు చూస్తే సిగ్గేస్తోందని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గుడిని ముఖ్యమంత్రి చేసుకున్నందుకు తెలుగు ప్రజలంతా క్షోభిస్తున్నారని చెప్పారు. తాను తిరిగి ముఖ్యమంత్రి కాకపోతే ప్రజలు బతకడమే కష్టం అనేలా జగన్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని హేళన చేశారు. 750 హామీలిచ్చిన జగన్ అందులో ఎన్ని అమలు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు ఖాయమని ఊహించుకుని జగన్‌రెడ్డి కుమిలిపోతున్నాడని, ఓడిపోతే తన అవినీతి, దోపిడీలు బయటపడితే మళ్లీ చెంచల్‌గూడ జైలుకు వెళ్లాల్సి వస్తుందనే భయంతో వణికిపోతున్నాడని విమర్శించారు. సభల పేరుతో రూ.600 కోట్ల ప్రజాధనాన్ని దారబోశాడని, 130 సార్లు బటన్ నొక్కాడని చెబుతున్న జగన్ రద్దు చేసిన 130 పథకాలపై మాట్లాడే ధైర్యముందా అని ప్రశ్నించారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసన దీక్షలు



రిలే దీక్షలో ఆర్టీసీ కార్మికులు

నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), మార్చి 13: ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం కొనసాగాయి. రెండవ రోజు దీక్షలను ప్రారంభించిన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయప్పరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించే సర్క్యులర్ నెంబరు 1-2019ను అమలు చేయకుంటే నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. ఆర్‌టీసీను ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఉన్న హామీలు పోయి ప్రభుత్వ జీవోలను అమలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి కృష్ణారావు, జిల్లా కార్యదర్శి ఎ క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంజనా

నెల్లూరు జడ్పీ, మార్చి13: నగరంలోని విద్యుత్ భవన్‌ను ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా బుధవారం సందర్శించారు. విద్యుత్ భవన్‌కు వెళ్లిన ఆమెకు ఎస్‌ఈ విజియన్ స్వాగతం పలికారు. విద్యుత్ భవన్‌లోని స్కాడా సెంటర్, మీటర్ టెస్టింగ్ ల్యాబ్, పరిపాలనా విభాగం తదితర కార్యాలయాలను సందర్శించి విద్యుత్ సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సంభవించిన తుఫానులలో తీసుకున్న చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

పోర్టులో గవర్నర్ సతీమణి సమీరా

ముత్తుకూరు, మార్చి 13 : అదాని కృష్ణపట్నం పోర్టును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సతీమణి సమీరా నజీర్ బుధవారం సందర్శించారు. నెల్లూరు నుంచి రోడ్డు మార్గంలో ఆమె కృష్ణపట్నం పోర్టుకు చేరుకున్నారు. సీ షెల్ గెస్ట్‌హౌస్‌లో పోర్టు ఉన్నతాధికారులు ఆమెకు స్వాగతం పలికారు. సౌత్ బెర్త్ పరిశీలించిన అనంతరం ఆమె బోట్‌లో ప్రయాణించి పోర్టును సందర్శించారు. పోర్టులో నిర్వహిస్తున్న ఎగుమతి, దిగుమతుల గురించి పోర్టు ప్రతినిధులు ఆమెకు వివరించారు.

చేనేత కుటుంబాలకు మగ్గాల పంపిణీ

మనుబోలు, మార్చి 13 : మడమనూరు గ్రామంలో బుధవారం వెంకటాచలం బ్లాక్ లెవెల్ క్లస్టర్ పరిధిలోని చేనేత కుటుంబాలకు రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మగ్గాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్, ఎంపీపీ వజ్రమ్మ, వైసీపీ నాయకులు హరగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

నెల్లూరు (విద్య), మార్చి 13 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హాస్టల్ విద్యార్థినుల సౌకర్యార్థం అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సహకారంతో 60 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌ను రూ.30 లక్షలతో ఏర్పాటు చేసేందుకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నిర్మాణం ద్వారా మంచినీటి సమస్య తీరుతుందన్నారు. పోర్టు ప్రతినిధులు ఎంతో ఔదార్యంతో తమ కళాశాల అభివృద్ధికి చేయూతనందించడం ఆనందంగా ఉందని తెలిపారు. పోర్టు సీఈవో జీజే.రావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తమకు అప్పగించిన బాధ్యతను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి కళాశాలకు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ టి.సంపత్‌కుమార్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.రాజు, పోర్టు ప్రతినిధులు రాజేష్ రంజన్, షేక్.మునీర్, డాక్టర్ సీహెచ్.రమేష్‌బాబు, స్థానిక కార్పొరేటర్ వై.వాసంతి, అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ సి.కళాప్రియ, విజయభాస్కర్, సృజన, చంద్రశేఖర్, పీఆర్‌టీ జోజి తదితరులు పాల్గొన్నారు.

'ఎండోమెంట్ లెక్చర్'

నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పి.హరిపద్మరాణి రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ఇంగ్లీష్ ఇన్ ద గ్లోబలైజ్‌డ్ ఎరా అనే సబ్జెక్ట్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆంగ్ల భాష ఉపయోగం, ప్రపంచవ్యాప్తంగా దీన్ని ఎలా ఉపయోగిస్తున్నారు, వెర్బల్, నాన్‌వెర్బల్ లాంగ్వేజ్, భాషపై ఎలా పట్టుసాధించాలన్న అంశాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి, వైస్ ప్రిన్సిపాల్ ఏవీ.రమణరావు, ఇంగ్లీష్ హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్.కృష్ణమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వాడకంపై చైతన్యం తేవాలి

నెల్లూరు(వైద్యం) మార్చి 13 : పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి బానిసలుగా మారుతున్న యువతలో చైతన్యం తేవాలని నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. బుధవారం వైద్య కళాశాలలో ప్రపంచ నో స్మోకింగ్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి అనేక మంది చిన్న వయస్సులోనే మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్వాసకోశ వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నపూర్ణ మాట్లాడుతూ 1984 నుంచి పొగాకు వాడకం వల్ల వచ్చే వ్యాధులను నివారించేందుకు ఈ నో స్మోకింగ్ డే నిర్వహిస్తున్నారన్నారు. నారాయణ మానసిక విభాగాధిపతి డాక్టర్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ధూమపానానికి బానిసలైన వారికి వాటాని విడనాడేలా డీ అడక్షన్ సెంటర్‌లో ఉచితంగా సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి, వైద్య కళాశాల ఏవో సందేష్ రైకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమంచర్లలో ఎంపీ ఆదాల పర్యటన

నెల్లూరురూరల్, మార్చి 13 : మండలంలోని ఆమంచర్లలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, నిర్వహించిన సంక్షేమ కార్యక్రమాలను చూసి తమ పార్టీకి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ విజయకుమార్ పాల్గొన్నారు.



ఓటు హక్కుపై బుచ్చిలో నిర్వహించిన బైక్ ర్యాలీ

ఓటే వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని కోవూరు నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి పాతపాటి వెంకటరత్నం అన్నారు. బుధవారం బుచ్చి ఎంఈవో కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్లకార్డులతో ఆయన అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి ఎం.దిలీప్‌కుమార్, మాస్టర్ ట్రైనర్స్ గండికోట సుధీర్‌కుమార్, హజరత్‌బాబు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం

టీడీపీ నుంచి ఎవరెక్కడ?

● నేడు విడుదల కానున్న రెండో జాబితాపై సర్వత్రా ఆసక్తి



వెంకటగిరి అభ్యర్థి లక్ష్మీ సాయిప్రసన్న

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేడు విడుదల కానున్న తెలుగుదేశం అభ్యర్థుల జాబితాపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆసక్తితో ఎదురు చూస్తోంది. ఈ రెండు జిల్లాల పరిధిలో తొలి జాబితాలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. తిరుపతిని మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీలలో ఒకదానికి కేటాయించే అవకాశముంది. ఇక మిగిలిన ఏడు స్థానాల్లో అభ్యర్థులెవరన్న దానిపైనే ఇప్పటిదాకా కొనసాగిన సస్పెన్స్ నేడు తొలగిపోయే ఆస్కారముంది.

సత్యవేడు, మదనపల్లెలపైనే అందరి చూపు

ప్రత్యేక పరిస్థితుల కారణంగా సత్యవేడు, మదనపల్లె నియోజకవర్గాలపైనే అందరి చూపూ పడుతోంది. సత్యవేడులో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైసీపీని వీడి టీడీపీకి చేరువైన సంగతి తెలిసిందే. అక్కడ టీడీపీ టికెట్ ఆదిమూలానికే ఖరారైనట్టు సమాచారం. అయితే టికెట్ ఆశిస్తున్న ఇతర నేతల సంఖ్య ఎక్కువగా వున్నందున వారందరినీ పిలిపించుకుని సర్దిచెప్పాల్సి వుందని, అంతే కాకుండా పార్టీ శ్రేణుల్లో వ్యతిరేకత రాకుండా ఆచితూచి అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. నియోజకవర్గంలో ఇవన్నీ సర్దుబాటు చేసిన తర్వాతే ఆదిమూలం పేరు ప్రకటించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది. కాబట్టి గురువారం వెలువడే జాబితాలో సత్యవేడు పేరు వుండదని సమాచారం. ఇక మదనపల్లె విషయానికొస్తే అక్కడ కూడా టీడీపీ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే వుంది. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ నుంచీ టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు టికెట్ ఖరారు చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ముస్లిం మైనారిటీలు అధికంగా వున్న మదనపల్లెలో వందల కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తులను కాపాడ్డంతో పాటు ఆ భూముల్లో భారీ షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించి వక్ఫ్ బోర్డుకు భారీగా ఆదాయాన్ని పెంచిన నేతగా ఆయనకు మైనారిటీ వర్గాల్లో హీరో వర్షిప్ వుంది. అధిక శాతం ముస్లింల మద్దతు ఆయనకే వుండడంతో అధిష్ఠానం షాజహాన్ వైపు మొగ్గుచూపినట్టు సమాచారం. అయితే అక్కడ ఆశావహులకు నచ్చజెప్పాల్సి వున్నందున గురవారం జాబితాలో ఈ స్థానం పెండింగ్ పెట్టచ్చన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఏడు స్థానాల్లో నేడు ఎన్నింటికో?

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో పుంగనూరు, మదనపల్లె, పూతలపట్టు, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి తదితర ఏడు అసెంబ్లీ స్థానాలు పెండింగులో ఉన్నాయి. గురువారం విడుదల కానున్న రెండవ జాబితాలో ఈ స్థానాలు అన్నింటికీ అభ్యర్థులను ప్రకటిస్తారా లేక కొన్ని స్థానాలు పెండింగ్‌లో పెడతారా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంటోంది. నిజానికి చంద్రగిరిలో పులివర్తి నాని, శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి, పూతలపట్టులో మురళీమోహన్, పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డిలకు అధికారికంగా ప్రకటించలేదు కానీ టికెట్లు ఎప్పుడో ఖరారయ్యాయి. అయితే తొలి జాబితాలో వీరి పేర్లు ప్రకటించకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. మార్పులేమైనా వుంటాయేమోనన్న అనుమానాలకు అవకాశం ఏర్పడింది. అయితే టికెట్ల ప్రకటనతో నిమిత్తం లేకుండా అధిష్ఠానంపై నమ్మకంతో ఈ నాలుగు స్థానాల్లో ఇంఛార్జులు ఎన్నికల ప్రచారానికి ఎప్పుడో శ్రీకారం చుట్టేశారు. ఇప్పటికే ఒకటికి రెండు సార్లు ప్రతి గడపా తొక్కి ఓట్లు అభ్యర్థించారు. కాగా పూతలపట్టు అభ్యర్థిని నేటి జాబితాలో వెల్లడించకపోవచ్చని సమాచారం. వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నడుమ పోటీ వుండగా తాను ఆత్మకూరు నుంచీ పోటీ చేస్తానని ఆనం ప్రకటించడంతో రామకృష్ణకు లైన్ క్లియర్ అయింది. అయితే ఆఖరి నిమిషంలో అధిష్ఠానం రామకృష్ణకు కాకుండా ఆయన కుమార్తె లక్ష్మీ సాయిప్రసన్నకు టికెట్ ఖరారు చేసింది.ప్రముఖ పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్‌కు కోడలు కూడా అయిన లక్ష్మీ సాయిప్రసన్న పేరు రెండవ జాబితాలో ప్రకటించే అవకాశముంది.

చిత్తూరు ఎమ్మెల్యేకి తిరుపతి సీటు!

అభ్యర్థి ఎంపికకు జనసేన తీవ్ర కసరత్తు... పలువురి పేర్ల పరిశీలన

సర్వేలో వ్యతిరేకత వచ్చినా ఆరణి వైపే జనసేనాని మొగ్గు



తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన సీటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఖరారైంది. టీడీపీ-బీజేపీలతో పొత్తు కూటమిలో వున్న జనసేనకు తిరుపతి సీటు కేటాయించిన సంగతి తెలిసిందే.టీడీపీ పరంగా తిరుపతి అసెంబ్లీ సీటు తొలినుంచీ కీలకమే. ప్రతిసారీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎంపికపై స్థానికంగానే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా జనం ఆసక్తి చూపుతుంటారు. అయితే ఈ పర్యాయం జనసేనతో పొత్తు కారణంగా అభ్యర్థి ఎంపిక మరింత ఆసక్తికరంగా మారింది. ఆరు నెలల కిందటే జనసేనతో పొత్తు వుంటుందని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేనకే కేటాయిస్తారన్న అంచనా జనంలో మొదలైంది. ఓ దశలో తిరుపతిలో అధికార పార్టీ అభ్యర్థిని ఢీకొనగలిగే వనరులు జనసేన నాయకులకు లేవన్న అభిప్రాయం కలగడంతో సీటు టీడీపీకే దక్కుతుందనే ప్రచారం జరిగింది. ఈలోపు సీట్ల సర్దుబాటు జరగడంతో తిరుపతి సీటు జనసేనకు కేటాయించారు. ఆ వెంటనే బీజేపీ కూడా కూటమిలో చేరడంతో తిరుపతి సీటును బీజేపీ కోరుతుందన్న ప్రచారం ప్రారంభమైంది. ఆలోగా చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆ పార్టీని వీడి జనసేనలో చేరిపోయారు. సీటు ఏ పార్టీకన్న ప్రచారాలు ఓవైపు సాగుతుండగానే మరోవైపు పరిణామాలు వేగంగా మారిపోయాయి.తిరుపతి సీటు జనసేనకు కేటాయించడంతో టీడీపీ నేతలు సుగుణమ్మ, ఊకా విజయ్ కుమార్ జనసేనలో చేరి టికెట్ తెచ్చుకునేందుకు సిద్ధపడ్డారు. వీరి ప్రయత్నాలు కొనసాగుతుండగానే రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి బుధవారం జనసేనలో చేరారు. తిరుపతి టికెట్ కోసం ఒత్తిడి పెరగడంతో తొలుత చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. సర్వేలో ఆయన పట్ల అత్యధికులు వ్యతిరేకత కనబరిచినట్టు తేలడంతో ఆయన పేరు పక్కన పెట్టి గంటా నరహరి వైపు మొగ్గు చూపుతున్నారని జనసేన, టీడీపీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ గంటల వ్యవధిలో ఆరణి శ్రీనివాసులును అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం. కాగా ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గ జనసేన, టీడీపీ వర్గాలలో కలకలం రేపాయి. స్థానికులైన బలిజలకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు ఎమ్మెల్యేకి టికెట్ ఖరారు చేయడం వివాదం రేగేందుకు అవకాశమిస్తోంది. ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం పట్ల టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల స్పందన ఎలా వుంటుందో, రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఈ రెండు పార్టీల్లో ఎలాంటి సమీకరణలకు దారితీస్తుందో వేచి చూడాల్సి వుంది.

వైసీపీ ప్రచారంలో ఎస్ఐ



రాజేష్‌తో ఎస్ఐ వెంకట నరసింహులు

సత్యవేడు, మార్చి 13 : సత్యవేడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ ప్రచారంలో ఎస్ఐ వెంకట నరసింహులు పాల్గొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో బుధవారం రాజేష్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఈ ప్రచారంలో రాజేష్‌తో ఎస్ఐ వెంకట నరసింహులు సన్నిహితంగా మెలుగుతూ ప్రచారంలో పాల్గొన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిజానికి రాజేష్ ప్రస్తుతానికి అభ్యర్థి మాత్రమే. అధికారికంగా ఎటువంటి ప్రోటోకాల్ వర్తించదు. నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ దాఖలు చేసిన తరువాత ప్రభుత్వమే అభ్యర్థికి గన్‌మెన్‌ను కేటాయిస్తుంది.ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సివుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.31
సహారి (శుక్రవారం) : 5.02





ధ్వజావరోహణం - సింహాసనం, కామధేనువులపై శివపార్వతుల పురవిహారం

సింహాసనంపై శివయ్య వైభవం

● ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం



ధ్వజావరోహణం సందర్భంగా పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 13: శ్రీకాళహస్తీశ్వరాలయ శివరాత్రి ఉత్సవాల్లో బుధవారం రాత్రి దేవరాత్రిని పురస్కరించుకొని శివపార్వతులు కైలాస మేరుపర్వత సింహాసనం, కామధేనువుపై పురవిహారం చేశారు.అంతకు ముందు ఉత్సవాలకు ధ్వజావరోహణ కార్యక్రమం ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ధ్వజ స్తంభం వద్ద కొలువుదీర్చారు. ఆ తరువాత యాగశాలలో పది రోజుల నుంచి పూజలందుకున్న స్వామి, అమ్మవార్ల ఆవాహన కలశాలకు పూజలు చేశారు. వేదోక్తంగా కలశ ఉద్వాసన పలికారు. అనంతరం యాగశాల నుంచి పవిత్ర కలశాలను అర్చకులు శిరస్సుపై దాల్చి ఆలయంలో ప్రదక్షిణ చేసిన తరువాత స్వామివారి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి వృషభ సంకేత ధవళ పతాకం, కొడి వస్త్రాలు అవనతం చేశారు.అనంతరం ధవళ పతాకాన్ని, దారాన్ని చతుర్మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకులకు దర్పింపచేశారు. ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కేడిగ వాహనంపై ఊరేగించాక వసంత మండపంలో త్రిశూలానికి, స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.ఉత్సవాల్లో గురువారం విశిష్టమైన పల్లకీసేవను నిర్వహించనున్నారు.

వలంటీర్లతో పౌర సమాచార సేకరణ

శ్రీకాళహస్తి, మార్చి 13 : వలంటీర్లతో పౌర సమాచారం సేకరించేందుకు యంత్రాంగం సన్నద్ధమైనట్లు తెలిసింది. వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లకు వెళ్లి ఆధార్ కార్డులను నమోదు చేసుకోవడం.. వాటికి లింక్ అయిన తాజా సెల్ ఫోన్ నెంబర్లను పక్కాగా నమోదు చేసుకోవడంపై కసరత్తు జరుగుతోంది. శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో గురువారం నుంచి పౌర సమాచారం సేకరించే ప్రక్రియను చేపట్టనున్నట్లు సమాచారం.ఇందుకు సంబంధించి బుధవారం పురపాలక సంఘ అధికారులు సచివాలయ, వలంటీర్ల గ్రూపుల్లో ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.అయితే ఎన్నికల వేళ ప్రజలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

కేజీబీవీలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 13: కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వి.శేఖర్ పేర్కొన్నారు.వచ్చేనెల 11వ తేదీ వరకు గడువుందన్నారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. జిల్లా పరిధిలోని 5 కేజీబీవీలలో అర్హులైన వారు దరఖాస్తు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.2లక్షలు, పట్టణ ప్రాంత కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.4లక్షలు కలిగిన అనాథ, బడి బయట పిల్లలు, డ్రాపవుట్స్, బీపీఎల్ కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వలస కార్మికులు, తల్లిదండ్రుల్లో ఒకరే ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను కేజీబీవీ వెబ్‌సైట్ నుంచి పొందాలని, మరిన్ని వివరాల కోసం ఆర్టీఈ టోల్‌ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించాలని కోరారు.

శ్రీవారికి థ్యాంక్స్

- గామి సక్సెస్‌పై హీరో విశ్వక్ సేన్



విశ్వక్‌సేన్, చాందిని

తిరుమల/తిరుపతి అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తన 'గామి' చిత్రం విజయవంతమైన నేపథ్యంలో శ్రీవేంకటేశ్వరస్వామికి థ్యాంక్స్ చెప్పడానికి తిరుమలకు వచ్చినట్టు హీరో విశ్వక్ సేన్ తెలిపారు. చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగిత, హీరోయిన్ చాందినితో కలిసి ఆయన బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం విశ్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ.. తన ప్రతి సినిమా విడుదలకు ముందు, తర్వాత స్వామి దర్శనానికి రావడం ఆనవాయితీ అన్నారు.'గామి' మంచి విజయాన్ని సాధించిన క్రమంలో స్వామికి ధన్యవాదాలు తెలిపేందుకు వచ్చానన్నారు. హీరోయిన్ చాందిని మాట్లాడుతూ.. గామి చిత్రాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలన్నారు. దర్శకుడు విద్యాధర్ మాట్లాడుతూ.. గామి విజయం ప్రేక్షకులు ఇచ్చిందన్నారు. మొదటిసారి తన తల్లితో కలిసి స్వామిని దర్శించుకుని ధన్యవాదాలు తెలిపానన్నారు. విశ్వక్‌సేన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. వారిలో కొంతమంది మొబైళ్లను విశ్వక్‌సేన్ సరదాగా లాక్కున్నారు. కాసేపు ఆటపట్టించిన తర్వాత తిరిగిచ్చేశారు.బుధవారం సాయంత్రం తిరుపతిలో నిర్వహించిన 'గామి' సక్సెస్ మీట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ చాలా రిస్క్‌తో తీసిన గామి విడుదలై నాలుగురోజులైనా కలెక్షన్స్ తగ్గలేదంటూ ఆనందం వ్యక్తం చేశారు.

అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి మెమోలు

● చెక్ పాయింట్‌లో తనిఖీల తీరు మారాలంటూ ఆదేశం
● టోల్‌గేటుకు అదనంగా 20మంది గార్డుల కేటాయింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



అలిపిరి టోల్‌గేట్‌లో బుధవారం నాటి తనిఖీలు

తిరుపతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సిద్ధం సభ నుంచీ నిషేధిత వస్తువులతో ఆర్టీసీ బస్సులు తిరుమల కొండపైకి చేరుకున్న ఘటనలో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన అలిపిరి టోల్‌గేట్ సిబ్బందికి టీటీడీ సీవీఎస్వో మెమోలు జారీ చేశారు.మద్యం గ్లాసులు, ఎముకలతో ఆర్టీసీ బస్సులు చెక్ పాయింట్ ఎలా దాటాయి? అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన వార్త టీటీడీ వర్గాల్లో కలకలం రేపింది. టీటీడీ సీవీఎస్వో ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వైసీపీ సభ నుంచీ నిషేధిత వస్తువులతో బస్సులు అలిపిరి చెక్‌పాయింట్ దాటిన సమయంలో విధుల్లో వున్న ఏడుగురు విజిలెన్స్ సిబ్బందిని, ఐదుగురు ఎస్పీఎఫ్ సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించి మందలించారని సమాచారం. వీరితో పాటు విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్‌ను కూడా పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక మీదట భద్రతా లోపాలు బయటపడితే చెక్‌పాయింట్ ఇన్‌ఛార్జిపై తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించినట్టు తెలిసింది. కాగా బుధవారం నుంచీ అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీలు ముమ్మరమయ్యాయి. తిరుమల నుంచీ అదనంగా 20 మంది గార్డులను అలిపిరి చెక్‌పాయింట్‌కే కేటాయించారు. ప్రతి యాత్రికుని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ క్రమంలో వాహనాలు టోల్‌గేట్ దాటడానికి ఆలస్యమైనా పరవాలేదని స్పష్టం చేసినట్టు సమాచారం. కాగా బుధవారం టోల్‌గేట్ వద్ద తనిఖీల తీవ్రత పెరిగింది. వాహనాల కదలికలు కూడా మందగించాయి. ఉన్నతాధికారుల ఆగ్రహంతో అప్రమత్తమైన చెక్ పాయింట్ సిబ్బంది కట్టుదిట్టంగా తనిఖీలు జరిపారు. తనిఖీల సందర్భంగా సెక్యూరిటీ గార్డులు కఠినంగా వ్యవహరించడంతో యాత్రికుల నుంచీ స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ బాటిళ్ళు భారీ సంఖ్యలో పోగుపడ్డాయి.

పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో సర్టిఫికెట్‌తో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13: పద్మావతి మహిళా యూనివర్సిటీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. యూనివర్సిటీ పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నిర్వహణకు ఐఎస్‌ఓ-21001:2018, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టంకు ఐఎస్‌ఓ-14001:2015తో పాటు ఎన్విరాన్‌మెంట్ సిస్టం, గ్రీన్ జోన్, రెయిన్ హార్వెస్టింగ్ విధానాలను అమలు చేస్తున్నందుకు గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డును కూడా పొందింది. ఈ మేరకు హైదరాబాదుకు చెందిన హైమ్ ఇంటర్నేషనల్ ఎండీ ఆలపాటి శివయ్య తెలిపారు. ఈ గుర్తింపు యూనివర్సిటీ పాటిస్తున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ప్రమాణాలకు సంకేతమని వీసీ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని పేర్కొన్నారు. ఈ గుర్తింపు సాధన కోసం పనిచేసిన వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అండ్ అష్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరిని అభినందించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించండి: పాశం



కరపత్రాలను అందజేస్తున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 13: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మంగళపూరు గ్రామంలో శంఖారావం- సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని దోచుకుంటోందన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా మోసం చేసిందని, అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి దౌర్జన్యాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. వైసీపీని గద్దె దించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ మహాకూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధురెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, పరంధామరెడ్డి, అమరేంద్ర, పెంచలయ్య, సురేంద్ర, కోటేశ్వరరావు, పాపయ్య, నరేంద్ర, గురవయ్య పాల్గొన్నారు.

మహాకూటమిని గెలిపించండి



అభివాదం చేస్తున్న బీజేవైఎం నాయకులు

గూడూరు, మార్చి 13: రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన మహాకూటమిని గెలిపించాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బీజేవైఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న రాక్షసపాలనను అంతమొందించేందుకు మహాకూటమిగా ఏర్పడి పోటీచేయడం జరుగుతోందన్నారు. ఈమహాకూటమిని గెలిపించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో శివశంకర్, సుధాకర్‌రాజు, కమల్, నవీన్, కిరణ్, మహేష్, శశి, ప్రదీప్, ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 13: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సరస్వతి శిశుమందిరంలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను పెంచి సంరక్షించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చునన్నారు. చెట్లు అంతరించిపోతుండడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, ఎస్ఎల్ఎన్‌బాబు, సుబ్రహ్మణ్యం, గాయత్రి, నాగలక్ష్మి, ప్రశాంతి, రంగనాయకులు, డీఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న సీఐ పాపారావు, ఉపాధ్యాయులు

గూడూరు, మార్చి 13: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని పట్టణ సీఐ పాపారావు అన్నారు. బుధవారం స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ముందుకు వచ్చి మండలంలోని 5 జిల్లా ఉన్నత పాఠశాలలో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులను దత్తత తీసుకుని వారికి క్రీడాదుస్తులు, పరికరాలు అందజేసి క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, కరిముల్లాఖాన్, హెచ్ఎం భారతి, పీడీ శివకుమార్, సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, రమేష్, కల్పన, భాస్కర్, సంస్థ సభ్యులు సుమంత్, హరికృష్ణ, లత, మౌనేంద్ర, ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

మొల్ల జయంతి వేడుకలు



మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరుణ్‌బోస్, సిబ్బంది

వెంకటగిరిటౌన్, మార్చి 13: మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి అడిషనల్ కమాండెంట్ అరున్‌బోస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా రాజేష్

నాయుడుపేట, మార్చి 13: వైసీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శిగా పొట్లపూడి రాజేష్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. నాయుడుపేటలో బుధవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను కలసిన రాజేష్ పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెళ్లకూరు, మార్చి 13: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పెళ్లకూరు మండలంలోని ముమ్మారెడ్డిగుంట, పుల్లూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు హరి అనే యువకుడిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్
యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 13: పట్టణంలోని భరత్‌నగర్‌లో చెట్టును మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని బిరదవాడ గ్రామానికి చెందిన చైతన్య(21) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తుమ్మూరులో ఉన్న కారును తీసుకువచ్చేందుకు మోటారు సైకిల్‌పై బిరదవాడ నుంచి బయలుదేరాడు. మార్గ మధ్యలో భరత్‌నగర్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 13: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఓ శీతల పానియాల దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 3 ఫుల్‌బాటిళ్లు, 4 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని ఎస్ఐ గోపి స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమాని ప్రతాప్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైకిల్ జోరు... ఫ్యాన్ బేజారు

- టీడీపీలో చల్లారిన అసమ్మతి
- వైసీపీలో రగిలిపోతున్న నాయకులు



తడ, మార్చి 13: మరి కొద్దిరోజుల్లో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. టీడీపీ ప్రచారంలో జోరుగా దూసుకుపోతుంటే వైసీపీ మాత్రం ప్రచారం మొదలుపెట్టలేక బేజారుగా కనబడుతుంది. ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉన్న సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో పార్టీ ఓటమితో శ్రేణులు డీలాపడిపోయాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు దగ్గరపడటంతో టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గంపై దృష్టి పెట్టింది. ప్రముఖ పారిశ్రామికవేత్త టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌కు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన నాయకులను సమన్వయం పరిచే పనిలోపడ్డారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ నెలవల విజయశ్రీని అధిష్ఠానం రంగంలోకి దింపింది. దీంతో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డితో పాటు ఇతర నాయకులు ఒక్కతాటిపైకి తీసుకువచ్చారు.

చేరికలతో దూకుడుగా టీడీపీ

వైసీపీలోని అసమ్మతి నాయకులైన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కట్టా రమణారెడ్డి తదితరులు టీడీపీలో చేరి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. మరికొంతమంది వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలో ఉన్న అసమ్మతి నేతలను సైతం టీడీపీ అధిష్ఠానం సమన్వయపరిచింది. అందరూ కలసికట్టుగా ప్రజల్లోకి వెళుతుండడంతో నియోజకవర్గం మొత్తం ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. గ్రూపు రాజకీయాలతో ఇన్నాళ్లు ఇబ్బందులు పడ్డ నాయకులంతా కలసికట్టుగా ప్రచారం సాగిస్తుండటంతో క్యాడర్‌లో సైతం ఉత్సాహం నెలకొంది.

వెనుకబడ్డ వైసీపీ

ఇక అధికార వైసీపీ ప్రచారంలో వెనుకబడిపోయింది. ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరో అధిష్ఠానం ఇప్పటి వరకు తేల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మరోమారు టిక్కెట్‌ను కేటాయిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రకటనలు చేయడం తప్ప అధిష్ఠానం నుంచి స్పష్టత రాలేదు. దీంతో పాటు వైసీపీలోని గ్రూపు తగాదాలు పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కిలివేటికి టికెట్ కేటాయిస్తే ఓడించి తీరుతామని కొంతమంది బాహాటంగానే ప్రకటించడం తలనొప్పిగా మారింది. కొంత మంది వైసీపీని వీడి టీడీపీలో చేరిపోవడం, మరి కొంత మంది అదేదారిలో ఉన్నట్లు తెలియడంతో అధిష్ఠానం అప్రమత్తమై అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా, అసమ్మతి నేత, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి మంగళవారం సీఎం జగన్‌ను కలిశారు. వైసీపీ గెలుపు కోసం పనిచేస్తామని హామీ ఇచ్చినట్లుగా సమాచారం.

వైసీపీది ధన బలం... టీడీపీది ప్రజా బలం: నెలవల



ప్రచార కరపత్రాలు అందజేస్తున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, మార్చి 13: టీడీపీకి కార్యకకర్తలు, ప్రజలే బలమని, ప్రజా బలంతో అధికార పార్టీ ధనబలం కొట్టుకుపోవడం ఖాయమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం పట్టణంలోని కసారెడ్డిపాలెంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని వినాయకుడి గుడి వద్ద పూజలు చేశారు. అనంతరం ఇంటింటా తిరిగి టీడీపీకి ఓటువేయాలని అభ్యర్థిస్తూ ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన వైసీపీ ధనబలం, దౌర్జన్యాలతో అధికారం దక్కించుకోవాలని పగటి కలలు కంటోందన్నారు. చంద్రబాబునాయుడికి వచ్చే ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే ప్రజాకోర్టులో వైసీపీకి శిక్ష తప్పదని హెచ్చరించారు. బీసీలు, ఎస్సీలపై కూడా అక్రమ కేసులు పెట్టి వేధించడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సురేష్ నాయుడు, అలవల శ్రీనివాసులు, నూలేటి రమణయ్య, బండారు ఆంజనేయులు, గంపల రవి, బుజ్జిబాబు, పెంచలయ్య, శ్రీధర్, మోహన్, పొన్నా కాటయ్య, మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వైసీపీ నేతలతో కలిసి నేదురుమల్లి జనార్దన రెడ్డి విగ్రహావిష్కరణ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి - ట్రాఫిక్ జామ్‌తో 108 వాహనానికి తప్పనితిప్పలు

నేదురుమల్లి విగ్రహావిష్కరణ

వాకాడు, మార్చి 13: వాకాడు స్వర్ణముఖినది ఒడ్డున మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన రెడ్డి విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. నేదురుమల్లి తనయుడు, జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, వైసీపీ నేతలు యల్లసిరి గోపాల రెడ్డి, దేవసేనమ్మ, సత్యనారాయణ, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తరలించిన జనం మధ్యలోనే ఒక్కసారిగా బయల్దేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.చివనకు 108 వాహనానికి దారిలేక రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి: కురుగొండ్ల



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, మార్చి13: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నిండలి, వాక్యం గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిండలి గ్రామస్తులు మాట్లాడుతూ పంటల సాగుకు అనువుగా లేని పొలాలకు మట్టి తోలుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. బాత్‌రూమ్ నిర్మించుకోవడానికి ఇసుక తోలుకునేందుకు కూడా అనుమతి తీసుకోవాల్సి రావడంతో అవస్థలు పడుతున్నామని కురుగొండ్ల దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు మట్టి తోలుకునేలా చర్యలు తీసుకుంటామని కురుగొండ్ల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, సీసీ నాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, కొమ్మి గెరటయ్య నాయుడు, వల్లిపి ఈశ్వర్, గోపాల్ రాజు, బీజేపీ నేత సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

నాయుడుపేట టౌన్, మార్చి 13: బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పెళ్లకూరు మండలం బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి, రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు చంద్రబాబునాయుడు ప్రకటించడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వాల హయాంలో బీసీలకు ఉన్నత పదవులను కట్టబెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీసీలందరూ ఏకమై విజయశ్రీని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలను ధీటుగా ఎదుర్కొంటామని, టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రఫీ, మురళీకృష్ణారెడ్డి, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ప్రారంభం



సీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట, మార్చి 13: నాయుడుపేటలో రూ.5.13 కోట్లతో నిర్మించిన 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ చంద్రకళ, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, చదలవాడ కుమార్, సిద్ధయ్య, రాజశేఖర్‌రెడ్డి, రత్నశ్రీ, కరీంబాయి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



డక్కిలి, మార్చి 13: మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ హుండీని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాబు పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. 196 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ11,24,786 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీధర్ నాయడు తెలిపారు.

బీసీలకు అండగా నిలిచేది టీడీపీనే

గూడూరు, మార్చి 13: టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు అండగా నిలుస్తోందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీలకు చంద్రబాబు ప్రకటించిన వరాలపై బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పాటుపడే టీడీపీని రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, పులిమి శివకుమార్, అల్లీహుస్సేన్, దయాకర్, రమేష్, కిరణ్‌కుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పట్టాల అందజేత

వెంకటగిరిటౌన్, మార్చి 13: పట్టణంలోని 8వ సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు కౌన్సిలర్ ఆరి శంకరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద బుధవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

కోట, మార్చి 13: మండల పరిధిలోని రుద్రవరం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మస్తానయ్య బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

శ్యామసుందరపురంలో పోషణ పక్వాడా

కోట, మార్చి 13: కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్ కృష్ణమ్మ చేతులమీదుగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాశం సంధ్యారాణి

గూడూరు, మార్చి 13: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక కోనేటిమిట్ట ప్రాంతంలో భవిష్యత్తుకు ష్యూరిటీ - బాబు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వలన ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా పలు సంక్షేమ పథకాలను అందజేసేలా చంద్రబాబునాయుడు మినీమెనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పిళ్లెల శ్రీనివాసులు, పేటేటి వెంకటేశ్వర్లు, పేటేటి ప్రకాష్ రావు, పిళ్లేల శ్రీదేవి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, చిరంజీవి, నాగేంద్ర, సన్నీ, తేజ, అశోక్, శ్రీకాంత్, కార్తీక్, కుమార్, లక్ష్మీనారాయణ, వాటంబేడు శివకుమార్, జనార్ధనరెడ్డి, సుబ్బయ్య, ఇంద్రవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, మార్చి 13: చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

చేయూత చెక్కుల పంపిణీ

ఓజిలి, మార్చి 13: మండలంలోని 2528 మంది మహిళలకు రూ.4.74 కోట్ల చేయూత పథకం చెక్కును సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అందజేశారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరుణమ్మ, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు నాంచారయ్య, కుందాం సొసైటీ అధ్యక్షుడు రాజారామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గుంటమడుగు రఘురామరాజు, శేఖర్, వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాద్‌రెడ్డి, నాయకులు మధుసూధన్‌రెడ్డి, వెంకటసుబ్బరాజు, బాబురెడ్డి, ముమ్మడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలో 2,413 మందికి రూ.4.52 కోట్ల చేయూత చెక్కులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ పోలం రెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ ప్రిస్కిల్లా, తహశీల్దార్ ప్రసాదరావు, ఏపీఎం మునిరాజమ్మ, కరణం రఘునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

గూడూరు అర్బన్, మార్చి 13: స్థానిక గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిసేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులను చదువులతో పాటూ క్రీడల్లోనూ ప్రోత్సహించేలా క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో కమలాకర్, శివకుమార్‌రెడ్డి, మునిరాజా, మణికుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తడ, మార్చి 13: ఇంటికి తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. మండల పరిధిలోని కారూరుమిట్ట గ్రామానికి చెందిన రాచపాళెం సుధాకర్ కుటుంబం సోమవారం రాత్రికి తమిళనాడులోని విల్లుపురం గ్రామానికి బయలుదేరి వెళ్లారు. మంగళవారం రాత్రి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న 11సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో కుక్కలు విపరీతంగా అరుస్తుండడంతో చుట్టుపక్కలవారు మేలుకొని పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం తెల్లవారుజామున సుధాకర్ ఇంటికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ
ఐదుగురికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 13: పట్టణంలోని తుమ్మూరు ఇందిరాకాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఇందిరాకాలనీలో నివాసం ఉంటున్న శ్రీలక్ష్మి స్థలంలో కిరణ్ తన ట్రాక్టర్ ట్రక్కును పార్కింగ్ చేశాడు. ట్రక్కును అక్కడ నుంచి తీసివేయాలంటూ కిరణ్‌కు శ్రీలక్ష్మి చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇద్దరి బంధువులు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. అఖిల్, మురళీ, కిరణ్, శ్రీలక్ష్మి, పోలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటలో ర్యాలీ

కోట, మార్చి 13: కోట పట్టణంలోని క్రాస్‌రోడ్డు నుంచి బజారుసెంటర్‌లోని గాంధీబొమ్మ సెంటర్ వరకు బుధవారం వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి వైసీపీ యువసేన ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

నాయుడుపేట, మార్చి 13: మున్సిపాలిటీతో పాటు మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇంటి పట్టాలను పంపిణీ చేశారు.

నిర్భయంగా ఓటేయండి

బాలాయపల్లి, మార్చి 13: బాలాయపల్లి, జయంపు, గొట్టికాడు గ్రామాల్లో సీఐ సంగమేశ్వరరావు నేతృత్వంలో బుధవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహబాబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

నాయుడుపేట టౌన్, మార్చి 13: మండలంలోని చిగురుపాడు సమీపంలో కోడిపందేల స్థావరంపై ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఉదాడులు నిర్వహించారు. మూడు కోళ్లు, రూ.1920 నగదు స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన టీడీపీ నేతలు

కోట, మార్చి 13: కోట మండలానికి చెందిన టీడీపీ నేతలు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను చిత్తూరు జిల్లా కుప్పంలో బుధవారం కలిశారు. తిరుపతి పార్లమెంటు కార్యదర్శులు వాకా విజయభాస్కర్‌రెడ్డి, మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్ ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను కలిసి మండలంలో సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.